@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

# మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

గురువారం
17 సెప్టెంబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :76
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE




## మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

- మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే'
- కేంద్రం కీలక ప్రకటన!
- మెటాను ఇక సాధారణ ఇంటర్మీడియరీగా చూడలేమన్న ప్రభుత్వ వర్గాలు
- లీగల్ ఇమ్యూనిటీపై తుది నిర్ణయం న్యాయస్థానాలదేనని వ్యాఖ్యలు



# ధరణి పేరిట దోపిడీ

- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలపై చర్చ చేపట్టాలి
- తెలంగాణ ఏర్పాటు, 22ఏ జాబితా సమస్యలు, కోర్టు తీర్పులు అంశాలపై చర్చ చేపట్టాలి
- సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అసెంబ్లీలో 22ఏ మాట్లాడారు.
- ధరణితో ఇష్టారాజ్యంగా భూముల బదిలీ
- మాఫియా చేతుల్లోకి కోట్ల మంది డేటా
- త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్

22ఏతో తెలంగాణ ప్రభుత్వం పేదలను వేధిస్తోందని ఆరోపణలు వచ్చాయన్న సీఎం రేవంత్ రెడ్డి... తమపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమపై వచ్చిన ఆరోపణల కారణంగా 22ఏ అంశంపై చర్చ చేపట్టామనని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ సీఎం మాట్లాడారు. సమస్య జఠిలానికి కారణమెవరో వివరిద్దామని సభలో చర్చ చేపట్టామని, ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాలేదని తమ బాధ్యత నుంచి వెనక్కి పోలేదన్నాప. వివాదానికి ముగింపు పలకాలని సభ్యులు కోరితేనే చర్చ చేపట్టామని వెల్లడించారు. నాటి అవకతవకలు బయటపడతాయని భావించారు ఎల్‌నినో కారణంగా పంటలకు ఇబ్బందులు వస్తున్నాయనన్న రేవంత్ రెడ్డి ప్రధాన సమస్యలపై చర్చ నుంచి తప్పించుకునేందుకే విపక్షం యత్నిస్తోందని విమర్శించారు. చర్చ ద్వారా తమ లోపాలు బయటపడతాయని విపక్షం భావిస్తోందని, 22ఏలో బీఆర్ఎస్ హయాం నాటి అవకతవకలు బయటపడతాయని భావించారని వెల్లడించారు. "1965లో భూదాన్ చట్టం వచ్చింది. 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం 1 ఆఫ్ 70 చట్టం తెచ్చింది. గిరిజనుల భూములను - మిగతా 10లో




### లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

- 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్
- 131వ స్థానంలో నిలిచిన భారత్
- వరుసగా 16వసారి తొలి ర్యాంకు దక్కించుకున్న ఐస్‌లాండ్

# గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృత్యువాత

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన గవర్నర్, సీఎం
- వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యుఒడిలోకి చేరిన ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది
- దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

### భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

- ఔలీ కొండల్లో డ్రోన్లు, ఆధునిక ఆయుధాలతో డ్రిల్స్
- ఉత్తరాఖండ్‌లో 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు
- డ్రిల్స్‌లో పాల్గొన్న 600 మంది సైనిక సిబ్బంది
- రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన



# భూభారతి కాదు.. భూహారితి

- చర్చకు పొంగులేటి వస్తారా?.. లేక సీఎం రేవంత్ వస్తారా?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు
- తాము ప్రభుత్వం అవినీతి మీద ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారు
- ఎన్నికల అఫడవిట్‌లో చూపించనవే సభలో రేవంత్‌రెడ్డి చెప్పారు
- భూభారతి స్కామ్ మీద సిట్టింగ్ జడ్జితో విచారణ ఎందుకు జరిపించరు?




హైదరాబాద్

తమ హయాంలో భూముల రిజిస్ట్రేషన్లు ఆగాయని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు సవాల్ విసిరారు. తనతో చర్చకు మంత్రి పొంగులేటి వస్తారా?, లేక సీఎం రేవంతే వస్తారో? తేల్చుకోవాలని చాలెంజ్ చేశారు. తాము ప్రభుత్వం అవినీతి మీద ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు హరీష్‌రావు. (బుధవారం, సెప్టెంబర్ 16వ తేదీ) తెలంగాణ భవన్ నుంచి మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. ఎన్నికల అఫడవిట్‌లో చూపించనవే సభలో రేవంత్‌రెడ్డి చెప్పారని హరీష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో రిజిస్ట్రేషన్లు ఆగాయంటే తన ముక్కును నేలకు - మిగతా 10లో




### మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్

- మక్కా సమీపంలో డ్రోన్ దాడి యత్నంపై భారత్ ఆందోళన
- దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన సౌదీ అరేబియా
- ఇది ఉగ్రచర్యేనని, రెచ్చగొట్టే ప్రయత్నమని సౌదీ ప్రకటన
- సౌదీ సార్వభౌమాధికారంపై దాడులను ఖండించిన భారత్

# సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం

- తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం
- సీఎం రేవంత్‌రెడ్డితో తెలిపిన సింగపూర్ బృందం
- మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను అసెంబ్లీ ఛాంబర్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి వివరణ
- గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ సింగపూర్ బృందాన్ని ఆహ్వానం
- మూసీ పునరుజ్జీవంతో నైట్ ఎకానమీకి ప్రోత్సాహం



హైదరాబాద్

తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం తెలిపింది. ఈ మేరకు అసెంబ్లీ ఛాంబర్లో సింగపూర్ ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ నిర్వహించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారిని కోరారు. దీంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలించే అంశాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి కూడా సీఎం వారికి సమగ్రంగా వివరించారు. సమావేశంలో సింగపూర్ ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. - మిగతా 10లో

### కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

- భారతీయ సినిమాకు చేసిన సేవలకుగాను ఈ పురస్కారం..
- సెప్టెంబర్ 22న గుజరాత్‌లో అవార్డు ప్రదానం
- అనంత్ నాగ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 300కి పైగా చిత్రాలు, 'మాల్గుడి డేస్'తో దేశవ్యాప్త గుర్తింపు



## సంపాదకీయం

# యూసీసీకి గ్రీన్ సిగ్నలా... రెడ్ సిగ్నలా

ఉమ్మడి పౌరస్మృతి విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029 లోక్ సభ ఎన్నికలకు ముందే దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో దీనిని అమలు చేస్తామని అత్యంత కీలక ప్రకటన చేశారు. ముంబైలో 'సేవా సంకల్ప అభియాన్' సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు.తాము అనేక రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని ప్రవేశపెట్టామని, 2029 నాటికి ఎన్డీయే అధికారంలో వున్న మొత్తం 21 రాష్ట్రాల్లో యూసీసీని కూడా అమలు చేస్తామన్న నమ్మకం తమకు వుందన్నారు. ఉమ్మడి పౌర స్మృతి అమలుపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ చిరకాల రాజకీయ అజెండాల్లో ఒకటైన యూసీసీని ఈసారి కేంద్ర చట్టం ద్వారా కాకుండా.. రాష్ట్రాల మార్గంలో ముందుకు తీసుకెళ్లే వ్యూహాన్ని ఎంచుకుంది.యూసీసీపై బీజేపీ చాలా కాలంగా తన వైఖరిని స్పష్టం చేస్తూ వస్తోంది. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టం ఉండాలన్నది ఆ పార్టీ వాదన. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్లమెంట్ ద్వారా ఒకేసారి జాతీయ స్థాయి చట్టం తీసుకురావడం కంటే.. రాష్ట్రాల శాసనసభల ద్వారా యూసీసీని విస్తరించడం వ్యూహాత్మక నిర్ణయంగా కనిపిస్తోంది.యూసీసీ పరిధిలోకి వచ్చే వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, కుటుంబ చట్టాలకు సంబంధించిన అంశాలు రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా లో ఉన్నాయి. ఈ అంశాలపై కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చట్టాలు చేసే అవకాశం ఉంది. ఈ రాజ్యాంగ వెసులుబాటును ఉపయోగించుకుని రాష్ట్రాల వారీగా యూసీసీ అమలు చేయాలని బీజేపీ భావిస్తోంది.రాష్ట్రాల స్థాయిలో చట్టాలు తీసుకురావడం వల్ల ఆయా ప్రాంతాల సామాజిక పరిస్థితులు, సంప్రదాయాలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ భావిస్తోంది. భవిష్యత్‌లో ఈ రాష్ట్రాల నమూనాలు జాతీయ స్థాయి యూసీసీకి పునాదిగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్ మరియు ఉత్తరప్రదేశ్‌లతో సహా 19 రాష్ట్రాలు మరియు రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్, గుజరాత్ మరియు అస్సాం రాష్ట్రాలు ఇప్పటికే ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయగా, మధ్యప్రదేశ్ దీనికి సంబంధించిన ముసాయిదాను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది.అయితే.. కొన్ని రాష్ట్రాల్లో కూటమిగా బీజేపీ అధికారంలో వుంది. ఉదాహరణకు ఏపీని తీసుకుందాం. ఇక్కడ తెలుగుదేశం, జనసేనతో కలిసి కూటమిగా బీజేపీ అధికారాన్ని పంచుకుంటోంది. శంలో తొలిసారిగా ఉత్తరాఖండ్ రాష్ట్రం యూసీసీ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 2025 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం వివాహం, విడాకులు, వారసత్వం, ఆస్తి హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల వంటి అంశాలను పరిధిలోకి తీసుకుంది.తర్వాత గుజరాత్, అసోం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు యూసీసీ బిల్లులను ఆమోదించాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు కూడా ఈ దిశగా కసరత్తు ప్రారంభించాయి.ప్రస్తుతం రాష్ట్రాల యూసీసీ చట్టాల్లో ప్రధానంగా వివాహాల తప్పనిసరి నమోదు, విడాకుల నిబంధనలు, వారసత్వ హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల నమోదు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు బహుభార్యత్వంపై నిబంధనలు, కుటుంబ చట్టాల్లో మార్పులను కూడా ప్రతిపాదిస్తున్నాయి. అయితే అన్ని రాష్ట్రాల్లో యూసీసీ చట్టాలు ఒకే విధంగా ఉండటం లేదు. ఆయా రాష్ట్రాల సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల్లో తేడాలు ఉన్నాయి.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలని సూచిస్తుంది. అయితే ఇది ఆదేశిక సూత్రాల్లో భాగం మాత్రమే కావడంతో నేరుగా అమలు చేయాల్సిన ప్రాథమిక హక్కు కాదు.అలాగే బిహార్ లో కూడా. అయితే. ప్రాంతీయ పార్టీలు లౌకికత్వం అన్న ఎజెండాతో ముందుకు సాగుతున్నాయి. ప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు.మరో వైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. "మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి" అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.యూసీసీ విషయంలో బీజేపీకి ఆ పార్టీలు కలిసొస్తాయా? లేదా.. మెలిక పెడతాయా? అన్నది చూడాలి.

# బ్రిక్స్ సూపర్ సక్సెస్!




చేరుకోవాల్సిన లక్ష్యంపై స్పష్టత, అందుకు అనుసరించాల్సిన మార్గంపై ఏకాభిప్రాయం సాధించగలిగితే శిఖరాగ్ర సమావేశాలు విజయవంతమవుతాయి. ఆ రెండూ లేకుంటే ఉత్త లాంఛనప్రాయ సమావేశాలుగా మిగులుతాయి. ఆ కోణంలో శని, ఆదివారాల్లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఘన విజయం సాధించినట్టు లెక్క. అలాగని ఈ సమావేశాలు సమీప భవిష్యత్తులో బ్రిక్స్ కరెన్సీని తీసుకురావాలని నిర్ణయించలేదు. అలాగే ఎడాపెడా సుంకాలు విధిస్తున్న అమెరికాను నిలదీయలేదు. పశ్చిమాసియా కల్లోలానికి నువ్వే కారణమని వేలెత్తి చూపలేదు. ఈ అంశాల్లో లౌక్యం ప్రదర్శిస్తూనే చేయదల్చుకున్నది చేయటంలో బ్రిక్స్ సఫలీకృతమైంది. ఇవి మాత్రమే కాదు... పరస్పరం కలహించుకుంటున్న ఇరాన్, దాని ప్రత్యర్థులు యూఏఈ, సౌదీలను సమావేశాలకు రప్పించగలిగింది. పైగా ఇరాన్, యూఏఈ మధ్య ప్రత్యక్ష చర్చలు జరిగాయి. దక్షిణ చైనా సముద్రం విషయంలో విభేదాలున్న చైనా, ఫిలిప్పీన్స్ కూడా సదస్సుకు హాజరయ్యాయి. భారత్, చైనాల వివాదం సరేసరి. ఇలా పరస్పర విరుద్ధ ప్రయోజనాలు గల దేశాలన్నీ ఒక ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటించటం చిన్న విషయం కాదు. అతిథేయ దేశంగా భారత్ ప్రత్యేక కృషి ఇందులో కనబడుతుంది. సభ్య దేశాలతో ఓపిగ్గా చర్చించాలి. ఒప్పించాలి. ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన టీమ్ ఆ పని చేయగలిగినందుకు అభినందించాలి.

ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో దక్షిణార్ధ గోళ దేశాల స్వరం వినిపించటంలో ఏదోమేరకు కృషి చేసిన అలీనోద్యమ సంస్థతో బ్రిక్స్‌కు పోలికలున్నాయి. కానీ వాటిమధ్య వ్యత్యాసం కూడా ఉంది. అప్పటి ద్విధ్రువ ప్రపంచంలో స్వతంత్రంగా మనగలగటానికి అవసరమైన ఆర్థిక సంపత్తి అలీనోద్యమానికి లేదు. బ్రిక్స్ అలా కాదు. అందులో పూర్తి స్థాయి సభ్యత్వంగల 11 దేశాలను చూసినా వాటి ఉమ్మడి దేశీయోత్పత్తి (జీడీపీ) వాటా ప్రపంచ జీడీపీలో 40 శాతం. ప్రపంచ జనాభాలో సగం ఈ దేశాల్లోనే ఉంది. ప్రపంచంలో చైనా రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థ. రష్యావద్ద అపారమైన చమురు నిక్షేపాలు, ఆయుధ నిల్వలు ఉన్నాయి. మనతోసహా బ్రిక్స్ దేశాలన్నీ ఆర్థికంగా చురుగ్గా ఎదుగుతున్న దేశాలు. బ్రెజిల్ అయితే దక్షిణమెరికా ఆర్థిక వ్యవస్థల్లో అతి పెద్దది. ఇవన్నీ సమష్టిగా దక్షిణార్ధ గోళ దేశాలను ఆర్థికంగా, రాజకీయంగా ప్రభావితం చేయగల స్థితిలో ఉన్నాయి.

ఇన్ని అనుకూలాంశాలున్నా అమెరికాపై నేరుగా ధిక్కార స్వరం వినిపించనప్పుడు ప్రయోజనమేమిటన్న సందేహం వస్తుంది. ఆ ప్రక్రియ క్రమబద్ధంగా సాగాలి. భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు తదితర సంస్థల్లో వర్ధమాన దేశాలకు మరింత మెరుగైన చోటీయాలని బ్రిక్స్ కోరుతోంది. కానీ అది అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించే డిమాండ్‌గా మారకుండా సదస్సు జాగ్రత్తపడింది. డాలర్ వాడకాన్ని క్రమేపీ తగ్గించుకునే ప్రక్రియలోనూ అదే ఎత్తుగడ పాటించింది. ఆ దిశగా అడుగులేస్తే బ్రిక్స్ దేశాలపై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేయటానికి ముందే 2024 డిసెంబర్‌లో డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఆ బెదిరింపుల్ని ఆయన అడపా దడపా కొనసాగిస్తూనే ఉన్నారు. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ఉనికిలో లేకుంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది మరి! అందుకే కావొచ్చు... ఆ విషయంలో బ్రిక్స్ సంయమనం పాటించింది. అది వేరే రూపంలో ఇప్పటికే అమలవుతోంది. చైనా, రష్యా 90 శాతం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని తమ తమ కరెన్సీల్లో జరుపుకొంటున్నాయి. రష్యా చమురు విక్రయాలకు మన దేశం రూపా యిల్లో చెల్లించింది. డాలర్ రద్దు చేయకుండానే దాని వాడకాన్ని తగ్గించటం బ్రిక్స్ దేశాలు ఎంచుకున్న పద్ధతి. ఐఎంఎఫ్ డేటా ప్రకారం ఇప్పటికీ ప్రపంచ విదేశీ మారకద్రవ్య నిల్వల్లో డాలర్ వాటా 56.77 శాతం. యూరో కరెన్సీ వాటా 20.25 శాతం. చైనా కరెన్సీ రెన్‌మిన్‌బి(ఆర్‌ఎంబీ) వాటా కేవలం 1.95 శాతం. డాలర్ నిల్వలు పుష్కలంగా ఉన్న చైనా మరో కరెన్సీని వినియోగించాలనుకున్నా దానికే నష్టం. మనకూ ఆ సమస్యవున్నా, అమెరికా ఆధిపత్యం స్థానంలో చైనాను అంగీకరించటానికి సిద్ధపడలేం. ఈ బహుళ ధ్రువ ప్రపంచంలో ఎవరి జాగ్రత్తలు వారివి. ఈ దశలో అస్పష్టతతోనైనా బ్రిక్స్ ఉమ్మడి ప్రకటన వెలువరించటం దానికదే ఘన విజయం.

# బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!

'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది. తాను అత్యంత బలవంతుడి ననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది. భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు. భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు.



పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్--టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్--షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు. బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది. ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్--చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది. నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది. దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరుపుకోవాలని ఎన్డీఏ పార్టీలను నిర్దేశిస్తున్న మోదీ వైఖరిలో బ్రిక్స్ అనుభవం తర్వాతనైనా మార్పు వస్తుందా? చెప్పలేం.

# మోదీ గారి సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.





**– వరంగల్ జిల్లాలో ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్' జిల్లా కార్యశాల.**

**మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. జిల్లా కన్వీనర్ డాశ్రీశ్రీ రాణా ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహణ. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'సేవా సంకల్ప్ అభియాన్' వరంగల్ జిల్లా కార్యశాల సత్యం కన్వెన్షన్ హాల్ లో ఈరోజు నిర్వహించబడింది. ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ రాణా ప్రతాప్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ 'సేవా సంకల్ప్ అభియాన్ - జన్ సేవ హీ ప్రభు సేవ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ గారి 25 సంవత్సరాల ప్రజా సేవను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వరంగల్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఈ అభియాన్‌ను విజయవంతం చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని తెలిపారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, ఆశీర్వాద దీపం, పారిశుధ్య కార్యక్రమాలు మరియు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో కన్వీనర్లు గార్లపాటి మంజుల రెడ్డి, పొనుగోటి వెంకట్ రావు, ఎర్రగొల్ల భరత్ వీర్, చిలువేరు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, బిజెపి జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, గుర్రాల చంద్రమౌళి, తక్కల్లపల్లి అమృత రావు, కట్ల రామచంద్రారెడ్డి మరియు వివిధ మండల అధ్యక్షులు, ప్రోగ్రాం మండల కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**– అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు**

**పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

**– కమిషనర్ టి. వెంకన్న**

**మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

బుధవారం వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువులో గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన పారిశుధ్య, ఇంజినీరింగ్, రహదారి తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం కోసం అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, జిడబ్ల్యుఎంసి, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువులోకి గుర్రపుడెక్క చేరిన నేపథ్యంలో, నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చెరువులో మిగిలి ఉన్న గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, రహదారులు, లైటింగ్, భక్తుల రాకపోకలు తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.దేశాయిపేటలో పారిశుద్ధ్యం పరిశీలన అనంతరం కమిషనర్ 12వ డివిజన్ పరిధిలోని దేశాయిపేట ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాలు, డివైడర్లు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

బిల్‌బోర్డులు, అడ్వర్టైజింగ్ బోర్డులు, అనధికార ఫ్లెక్సీలు తదితరాలు ఏర్పాటు కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటో ద్వారా తడి, పొడి చెత్తను క్రమం తప్పకుండా వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రణాళిక ప్రకారం స్వీపింగ్ మిషన్ల ద్వారా రహదారులను శుభ్రం చేయడంతో పాటు డివైడర్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

పారిశుధ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు రోజువారీగా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ పరిశీలనలో సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, జవాన్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి


**– మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ మరియు సీడీఎంఏ డా. టి.కె. శ్రీదేవి**

**– హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**– హన్మకొండ సమీకృత కలెక్టరేట్ నుండి హాజరైన ప్రత్యేకాధికారి చాహాత్ బాజ్ పాయ్, కమిషనర్ టి.వెంకన్న....**

**మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





వరంగల్ నగర సమగ్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరతంగా పూర్తి చేసి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనులను ప్రారంభించాలనిమునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ మరియు సీడీఎంఏ డా. టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ నగర యూజీడీ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హన్మకొండ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి బల్దియా ప్రత్యేకాధికారి చాహాత్ బాజ్ పాయ్, కమిషనర్ టి. వెంకన్న పాల్గొని ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, చేపట్టిన చర్యలను సీడీఎంఏకు వివరించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ, యూజీడీ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి, పనులను వేగవంతంగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత మార్గదర్శకాలు, సాంకేతిక ప్రమాణాలు, సంబంధిత నివేదికలను సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

నగర పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడంతో పాటు నగర సమగ్ర అభివృద్ధికి యూజీడీ ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించి, నిర్ణీత కాలంలో పూర్తి చేసేలా పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సీడీఎంఏ ఆదేశించారు.

ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి టెండర్ల ఆహ్వానానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు సిడిఎమ్ఏకు వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈలు రవి కుమార్, సంజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ కార్తీక్ రెడ్డి, టీపీఎస్ అవినాష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గుడిబండ పై కంకర మిషన్ వద్దు అనుమతులు రద్దు చెయ్యకుంటే ఆందోళన

**సెప్టెంబర్ 16 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**





వెల్దుర్తి మండలం కుకునూరు .గ్రామ సమీపంలో గుడిబండపై కంకర మిషన్ వేస్తే తమకు నష్టం వాటిల్లుతుందని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, తాసిల్దార్ విజయలక్ష్మిలకు కుక్కునూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే బండపై కంకర మిషన్ వేసేందుకు ప్రయత్నాలు చేస్తే గ్రామస్తులమంతా ముక్కుమ్మడిగా అడ్డుకున్నామని తెలిపారు. ఈ బండపై కంకర మిషన్ వేయడం వల్ల పర్యావరణం దెబ్బతిని భూగర్భజాలు అడుగంటుతాయని మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ గ్రామస్తులు మాణిక్ రెడ్డి వెంకట్ రెడ్డి మురళి మహేందర్ రెడ్డి సంతోష్ సురేందర్ రెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కంకర మిషన్ అనుమతులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## నేర్దం ఈశ్వరమ్మ గౌడ్ కుటుంబం ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు

**– పూజ అనంతరం స్థానికులకు అన్నప్రసాదం పంపిణీ**

**బీరప్ప గడ్డ, సెప్టెంబర్ 16 ( మన మీ వార్త):**





ఉప్పల్ బీరప్పగడ్డలోని నిర్దం రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నేర్దం ఈశ్వరమ్మ గౌడ్ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్థానికులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్దం కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నేర్దం భాస్కర్ గౌడ్, విజయలక్ష్మి, నేర్దం ప్రసాద్ గౌడ్, సౌభాగ్యలక్ష్మి, నేర్దం రాజు గౌడ్, స్నేహ, నేర్దం బాలకృష్ణ, ఈశ్వర్, నేర్దం వీర్ గౌడ్, డాక్టర్ నేర్దం మనీషా గౌడ్, అడ్వకేట్ నేర్దం అనూష గౌడ్, నేర్దం భాగ్యశ్రీ గౌడ్ (ఎంబీఏ, సౌత్ కొరియా), నేర్దం వివేకవర్ధిని, నేర్దం దివిజా గౌడ్, నేర్దం ధ్యాన్షి, నేర్దం ద్వితీ గౌడ్, రాగుల నరసింహ, కృష్ణవేణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం, అన్నప్రసాద పంపిణీతో నేర్దం రెసిడెన్సీలో భక్తి వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## రాఘవేంద్ర నగర్ పోచమ్మ గుడి వద్ద వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు

**– పూజల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు**

**నాచారం, సెప్టెంబర్ 16 ( మన మీ వార్త):**





రాఘవేంద్ర నగర్ పోచమ్మ గుడి వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ నాయకులు హాజరై గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో నాయకులు, స్థానికులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ, పరస్పర సోదరభావం, ఐక్యతతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రాంత ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సంతోషం, సమృద్ధి కలగాలని వారు కోరుకున్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**సెప్టెంబర్ 16 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**



పోషణ మహోత్సవంలో భాగంగా వెల్దుర్తిలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడీ సూపర్వైజర్ మాధవి హాజరై బాలింతలకు గర్భిణులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది ముఖ్యంగా సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు ఈ పోర్షన్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందని గర్భిణీలు బాలింతలు క్రమం తప్పకుండా ఈ పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడం జరుగుతుందని క్రమం తప్పకుండా ఈ ఆహారాన్ని సేవించాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు

## మల్లికార్జున ఆలయ ప్రాంగణంలో నిఘా నేత్రాలు!

**పటాన్ చేరు సెప్టెంబర్ 16 మీ వార్త ప్రతినిధి :**

**– మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా..**

**– 25 సీసీ కెమెరాలు ఏర్పాటు**



బీరంగూడ గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో ఇక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడనుంది. భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, నాలుగు ప్రధాన ప్రవేశ మార్గాల్లో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసులు నిర్ణయించారు.ఈ మేరకు సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్‌యాదవ్, సిబ్బందితో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించారు.ముఖ్యంగా ఆలయ పరిసరాల్లోని పార్కింగ్ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని మద్యం సేవించే వారితో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద కదలికలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాల్లో ప్రశాంతమైన, సురక్షిత వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. 25 నిఘా కెమెరాల ఏర్పాటుతో మల్లికార్జున ఆలయ పరిసరాల్లో పోలీసుల నిఘా మరింత పటిష్టం కానుంది.

## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

**- వద్దేపల్లి రాజేశ్వర్ రావు, కాంచి మహేందర్**

**కూకట్పల్లి సెప్టెంబర్ 16 మన మీ వార్త**



సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం గా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్/మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వద్దేపల్లి రాజేశ్వర్ రావు, కాంచి మహేందర్ పాల్గొన్నారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు బీజేపీ ప్రతిపాదించిన తెలంగాణ సప్త సంకల్పాలు ను అమలు చేయాలని వారు అధికారులను కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంతో పాటు సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్మారక చిహ్నం ఏర్పాటు, హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం నిర్మాణం, జిల్లా స్థాయిలో స్మృతి కేంద్రాల ఏర్పాటు, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చడం, చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్తూపాల నిర్మాణం, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు వంటి అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు.

విమోచన పోరాటంలో అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ వారి చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేఆర్ నగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో గణంగా అన్నదాన కార్యక్రమం...

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 16: (వార్త ప్రతినిధి)**



జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో గౌడ సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. గౌడ కులస్తులు, సంఘం సభ్యులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, స్థానికులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, సంఘం పెద్దలు,



ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన వారికి అన్నదానం చేశారు. దీంతో బీజేఆర్ నగర్‌లో సందడి నెలకొంది.

కార్యక్రమానికి జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు, పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన కమిటీ ఏర్పాటైన తర్వాత చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. కమిటీ సభ్యులు, సంఘం నాయకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బీజేఆర్ నగర్ పరిధిలో గౌడ కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్తులో సొసైటీ ఏర్పాటు చేసుకునే ఆలోచన కూడా ఉందని తెలిపారు. గౌడ కులస్తుల సంక్షేమం, ఐక్యత కోసం అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- నేడు తెలంగాణ విమోచన దినోత్సవం**

**లక్ష్మణ్ చందా, సెప్టెంబర్ 17(మన మీ వార్త)**



తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2012, 2013 సెప్టెంబర్ 17న లక్ష్మణచందా మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు ఉద్యమకారుడు గంగన్న తెలిపారు. ఆ సమయంలో ఉద్యమంలో పాల్గొన్న తనను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన




కోసం ఉద్యమించిన సమయంలో పలువురు ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గంగన్న పేర్కొన్నారు. ఉద్యమకారులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.25 వేల ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు, ఇతర అవసరాలకు సంబంధించిన ప్రయోజనాలు అందిస్తామని చెప్పినప్పటికీ, ఇప్పటివరకు వాటి అమలుపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గంగన్న కోరారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించడంతో పాటు హామీ ఇచ్చిన ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు, ఇతర ప్రయోజనాలను త్వరగా అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం

**మనోహరాబాద్ సెప్టెంబర్ 16 మన మీ వార్త ప్రతినిధి**



మండలంలో గల పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని కొనియాడారు. స్థానిక మండల విద్యాధికారి పి వెంకటస్వామి మాట్లాడుతు మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎన్నుకోవడంలో సంక్లిష్టంగా ఉందని మండలంలోని అందరు ఉత్తమ ఉపాధ్యాయులను కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతు వారి వారి బోధన అనుభవాలని పంచుకోవడం జరిగిందని కొనియాడారు.

# లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు వేగవంతం చేయాలి

**- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి



నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా



సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనతో పాటు ప్రజల భద్రతపై అవగాహన వెంకట్ రెడ్డి నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ సురక్ష సంకల్ప్--2026 కార్యక్రమం

**వెంకట్ రెడ్డి నగర్, సెప్టెంబర్ 16 ( మన మీ వార్త):**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ సురక్ష సంకల్ప్--2026 కార్యక్రమంలో భాగంగా వెంకట్ రెడ్డి నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వినాయక మండపంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆకారపు అరుణ్ పటేల్ మరియు టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, డిఐ రవికుమార్, ఎస్ఐతో పాటు ఈగిల్ టీం సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు భద్రతపై విలువైన సూచనలు అందించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రతకు



ప్రాధాన్యతనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆహార భద్రతలో భాగంగా పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు.



కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అరుణ్ పటేల్ మరియు టీం సభ్యులకు, ప్రజల భద్రత కోసం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# అంబేద్కర్‌ను అవమానించే పుస్తకాన్ని వెంటనే తొలగించాలి- శేఖర్ మాస డిమాండ్

**చిలుకానగర్, సెప్టెంబర్ 16 ( మన మీ వార్త):**

డా. బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించేలా రచించిన "కల్పిత నాయకుడు" పుస్తకాన్ని వెంటనే తొలగించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఉప్పల్ నియోజకవర్గ మాల సంఘాల ఇంచార్జ్ (జేఏసీ ), చిల్కానగర్ మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్ మాస డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ రచించిన ఈ పుస్తకాన్ని రచించి, విడుదల చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో శేఖర్ మాస మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ కోట్లాది అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. అంబేద్కర్‌ను కించపరిచేలా పుస్తకాలు రచించడం, విడుదల చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఇలాంటి రచనలు సమాజంలోని అన్ని వర్గాల మధ్య సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ రాజ్యాంగం పుస్తకాన్ని చేతబట్టి రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారని, అదే సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్న





కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్న పుస్తకంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శేఖర్ మాస ప్రశ్నించారు. రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ పార్టీకి నిజమైన గౌరవం ఉంటే, తెలంగాణలో విడుదలైన ఈ పుస్తకంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పుస్తకాన్ని తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైతే అందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం కోసం ఐస్క్రిప్స్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని శేఖర్ మాస స్పష్టం చేశారు.

# కంది శ్రవణ్ రెడ్డి గారి చేతుల మీదుగా మణప్పురం గోల్డ్ లోన్ నూతన బ్రాంచ్ ప్రారంభం

**---నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన హబ్సీగూడ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి**

**---రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి శుభాకాంక్షలు తెలిపిన కంది శ్రవణ్ రెడ్డి**

**హబ్సిగూడ, సెప్టెంబర్ 16 ( మన మీ వార్త):**

ప్రముఖ ఫైనాన్స్ సంస్థ మణప్పురం గోల్డ్ లోన్ నూతన బ్రాంచ్ హబ్సీగూడ స్ట్రీట్ నంబర్ -8 లో బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. బ్రాంచ్ మేనేజర్ కీర్తన, అసిస్టెంట్ మేనేజర్ శివ కుమార్ ఆహ్వానం మేరకు హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన బ్రాంచ్ ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కేక్ కట్ చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, సంస్థ నిర్వాహకులు ఆయనకు తమ సంస్థ అందించే సేవలు, సేఫ్టీ లాకర్లు, క్యాబిన్ల గురించి వివరించారు. కంది శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఫైనాన్స్ రంగంలో నమ్మకమైన సంస్థగా మణప్పురం గోల్డ్ లోన్ కు మంచి పేరు





ఉందన్నారు. మణప్పురం సంస్థ తమ సేవలను మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. హబ్సిగూడ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హబ్సీగూడ కాంగ్రెస్



సీనియర్ నాయకులు గన్నారం విజయ్ కుమార్, మురళీ కృష్ణ ముదిరాజ్, ధర్మా నాయక్, రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు నాయక్, సుమన్ నాయక్, మణప్పురం ఏరియా హెడ్ మహదేవ్, రామ్ కృష్ణ మండల్, ఎఫ్జెడ్ఎం మోహన్ రెడ్డి, ఉద్యోగులు మనోజ్, రాజేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శలు





లక్ష్మణ్ చందా, సెప్టెంబర్ 16(మన మీ వార్త)

మండల కేంద్రంలోని లక్ష్మణచందా గ్రామానికి చెందిన ఓసా మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్,సర్పంచ్ ఓస కవిత–రాజు,మాజీ జడ్పిటీసీ ఓస రాజేశ్వర్,కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ మండల అధ్యక్షులు అస్గర్ ,బాబాపూర్ ఉప సర్పంచ్ సురేష్ రెడ్డి,ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి: వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ.

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ వరంగల్ ఆటోనగర్ లోని పరిశీలన గృహం, దేశాయిపేట లోని ఇండియా డిసిపిల్స్ మిషన్ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ మరియు సఖీ వన్ స్టాప్ సెంటర్లను సందర్శించి, రికార్డులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలన గృహం మరియు ఇండియన్ డిసిపిల్స్ మిషన్, (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్)లోని బాలలతో న్యాయమూర్తి ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, భద్రత మరియు ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వారి సమస్యలను సానుభూతితో విని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



సఖీ వన్ స్టాప్ సెంటర్ను సందర్శించిన న్యాయమూర్తి, అక్కడ అందిస్తున్న సేవలు, బాధిత మహిళలకు కల్పిస్తున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీస్ సహకారం మరియు పునరావాస సేవలు తదితర అంశాలను పరిశీలించారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, బాధితులకు సకాలంలో అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాలలు మరియు మహిళల హక్కుల పరిరక్షణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్

## వరంగల్, దుగ్గొండి మండలం మందపల్లి గ్రామంలో భూముల సమగ్ర రీ-సర్వేపై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా రీ-సర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూ కొలతలు, సరిహద్దుల నిర్ధారణ,



భూ హక్కుల వివరాల నమోదు, భూ రికార్డుల పరిశీలన తదితర అంశాలను రైతులకు అధికారులు వివరించారు. రీ-సర్వే ద్వారా భూముల వివరాలు మరింత ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.
రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, రీ-సర్వే సమయంలో అధికారులు నిర్వహించే కొలతలు, వివరాల పరిశీలనలో సహకరించాలని సూచించారు. తమ భూములకు సంబంధించిన వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలో రైతులు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. రీ-సర్వే ప్రక్రియపై పూర్తి వివరాలను తెలియజేశారు. ఈ గ్రామ సభలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్, ఎడి సర్వే ల్యాండ్ మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాలు, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డిఆర్డిఓ నాగపద్మజా, సర్పంచ్ శ్రీమాలతి, దుగ్గొండి తహసిల్దార్ సమ్మక్క మరియు గ్రామ రైతులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికార పాదయాత్రకు తరలిరావాలి

– టిఆర్పి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ పిలుపు

భూపాలపల్లి సెప్టెంబర్ 16 (మీవార్త)



: తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బీసీల రాజ్యాధికార పాదయాత్రను నేడు హైదరాబాద్‌లోని గోల్కొండ నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రారంభించనున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తెలిపారు.

ఈ సందర్భంగా రవి పటేల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీసీలకు రాజ్యాధికారం, సామాజిక సమానత్వం సాధించాలనే లక్ష్యంతో 14,500 కిలోమీటర్ల పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. పాదయాత్రను దశలవారీగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో గోల్కొండకు తరలివచ్చి పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనాలని రవి పటేల్ పిలుపునిచ్చారు.
సమాజంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు, సామాజిక న్యాయం అందేలా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు ప్రణయ్ రాజ్, వెంకటేష్, సంతోష్, శ్రీను, రాంబాబు, సతీష్, ముక్తేశ్వర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ కౌకూర్ గా అభివృద్ధి చేయడమే లక్ష్యం...

– బస్‌స్టాప్ జంక్షన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు -- తుడిమెళ్ల మల్లికార్జున్

కౌకూర్ సెప్టెంబర్ 16: (వార్త ప్రతినిధి)

కౌకూర్ బస్‌స్టాప్ జంక్షన్ లో వినాయక నిమర్జనం చెరువు వద్ద తెలంగాణ డైనమిక్ మాస్ లీడర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు పర్యటించి, వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. అనంతరం జోనల్ కమిషనర్ శ్రీ సాంచిత్ గంగ్వార్ , డీఈ శ్రీమతి పద్మలత తో కౌకూర్ బస్‌స్టాప్ సర్కిల్‌ను ప్రధాన జంక్షన్‌గా అభివృద్ధి చేయడం, ట్రాఫిక్ మరియు ప్రజల సౌకర్యాల కోసం అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ, కౌకూర్ బస్‌స్టాప్ జంక్షన్ అభివృద్ధికి ఇప్పటికే పలుమార్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులతో కలిసి పరిశీలనలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల మార్పిడి ప్రక్రియ ప్రస్తుతం అంచనా దశలో ఉందని, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు.



"కౌకూర్‌ను మోడల్ కౌకూర్‌గా తీర్చిదిద్దడమే మా ప్రధాన అజెండా. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ తదితర అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజల అవసరాలే మా మొదటి ప్రాధాన్యత" అని మల్లికార్జున్ అన్నారు.

అలాగే 2024లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి హనుమంత్ రావు చొరవతో అల్వాల్ మున్సిపల్ పరిధిలో కౌకూర్‌లో వినాయక నిమజ్జన చెరువు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కౌకూర్ ప్రజలకు ఉపయోగపడే అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన నాయకత్వంలో ముందుకు సాగాయని తెలిపారు.

ఈ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో తోట లక్ష్మీకాంత్ రెడ్డి భాగస్వామ్యం, సహకారం కూడా ఎంతో ఉందని మల్లికార్జున్ తెలిపారు. కౌకూర్ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, సంబంధిత శాఖలతో సమన్వయం చేయడంలో ఆయన సహకారం ముఖ్యంగా ఉందని పేర్కొన్నారు. చాలా రోజుల తర్వాత మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ తమతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని మల్లికార్జున్ అన్నారు. కౌకూర్ అభివృద్ధికి ఆయన అందించే సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ , మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ లక్ష్మీకాంత్ రెడ్డి , శ్రీనివాస్ యాదవ్ , అలీ మల్లేష్ , అసిఫుల్లా ఖాన్ , అలీ పాండు , సయ్యద్ అస్లాం , గౌరీనాథ్ గ, గోమారం అంజిరెడ్డి , ధర్మారావు , కృష్ణ ముదిరాజ్ , వెంకటేశ్వర్లు , సత్తి రెడ్డి , చిత్ర గోకుల్ , పుష్ప , వాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువలో.. మోడల్ రైతుబజార్!

పటాన్ చేరు సెప్టెంబర్ 16 మీ వార్త ప్రతినిధి :

– ఆదివారం నుంచే విక్రయాలు ప్రారంభించాలి.. ఆదర్శ్‌రెడ్డి సూచన

– పెండింగ్ పనులు పూర్తి చేసిఅన్ని షాపులను అందుబాటులోకి తేవాలి: సింధు ఆదర్శ్‌రెడ్డి

భారతీనగర్ డివిజన్ బాంబేకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ రైతుబజార్ షాపుల ప్రారంభ కార్యక్రమం జరిగింది. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా షాపుల కేటాయింపుదారులతో ఆదర్శ్‌రెడ్డి మాట్లాడారు. కొన్ని మౌలిక సదుపాయాల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రజలకు రైతుబజార్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆదివారం నుంచే కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని షాపుల కేటాయింపుదారులను కోరారు.అదేవిధంగా రైతుబజార్‌లో మిగిలి ఉన్న షాపులకు టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, అన్ని షాపులను వినియోగంలోకి తీసుకురావాలని సింధు ఆదర్శ్‌రెడ్డి అధికారులను కోరారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్ మౌలిక సదుపాయాల పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.రైతుబజార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే భారతీనగర్, బాంబే కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో నిత్యావసరాల కొనుగోలు సులభతరం కానుంది. తాజా సరుకులు అందుబాటు ధరల్లో లభించేలా రైతుబజార్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, షాపుల కేటాయింపుదారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

– బొజ్జ హేమంత్ ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షులు

పరకాల ప్రతినిధి మన మీ వార్త



పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు బొజ్జ హేమంత్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభించిన దగ్గర నుండి ఇప్పటివరకు వర్షం పడ్డప్పుడల్లా విద్యార్థులు కళాశాలకు రావాలంటే నడవలేని పరిస్థితి ఉందన్నారు కాలేజీ ముందు మొత్తం నీరు నిల్వ ఉండి వారం పది రోజుల వరకు కూడా నీరు డ్రైనేజీ కాలువల్లోకి వెళ్లే వీలు లేక విద్యార్థులు నడవలేని పరిస్థితిలో ఉండి విద్యార్థులకు క్లాసులకు రాలేక ఇబ్బంది విద్యార్థులు సాయంకాల సమయంలో మానసిక ఒత్తిడి నియంత్రించేలా ఆటలు ఆడుకోవాలని కూడా నీరు ఉండి విద్యార్థులు గ్రౌండ్లో ఆడుకోలేని పరిస్థితి ఉంది అన్నారు కళాశాల ప్రారంభానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని తాత్కాలికమైన పనులు చేసి కళాశాల ప్రారంభోత్సవం చేశారు అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా విద్యార్థులకు టాయిలెట్స్ బాత్రూమ్స్ లేక విద్యార్థినీ విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు కేవలం సీఎం పర్యటనలో భాగంగా కళాశాల చూడడానికి ఆకర్షణగా చూడ్డానికి కనిపించే విధంగా గోడలు కట్టి రంగులేసి ఆ తర్వాత వాటిని పట్టించుకోవడమే లేదు అని అన్నారు కాబట్టి ఇప్పటికైనా పరకాల శాసనసభ్యులు , ఉన్నతాధికారులు స్పందించి ఈ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎండి అఫ్రోజ్ , పరకాల గర్ల్స్ కన్వీనర్ శ్రీ వర్ష, కళాశాల అధ్యక్షులు అధ్యక్షులు సాహిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలి

– అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ వెంకన్న

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు.
బుధవారం హనుమకొండ నగరంలోని గోపాల్‌పూర్, కాజీపేట, ప్రకాశ్‌రెడ్డిపేట, పద్మాక్షి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్మించిన భవనాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి సంబంధించి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భవన నిర్మాణదారులు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి పొందిన బిల్డింగ్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టకుండా, భవన నిర్మాణానికి సంబంధించిన అన్ని నిబంధనలు, ప్రమాణాలను తూచ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.
భవన నిర్మాణం పూర్తయిన అనంతరం అక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో, అనుమతి పొందిన ప్లాన్, వాస్తవంగా నిర్మించిన భవనం మధ్య ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని కమిషనర్ సూచించారు.
నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టడం ద్వారా భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. ఈ పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టిపీఓ అవినాష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్, జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 20వ తేదీన చేసిన నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షకు ఉల్లాస్ పోర్టల్‌లో నమోదైన ప్రతి మహిళ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయిలోని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లపై ఉందన్నారు. పోర్టల్‌లో నమోదైన అభ్యర్థులందరినీ పరీక్షకు హాజరయ్యేలా ముందస్తుగా అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యను అందించి, వారిలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.
అదేవిధంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా వరంగల్ జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేవని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన అడ్మిషన్ లక్ష్యాన్ని పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యను కొనసాగించేలా విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.
ఉల్లాస్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, డీఎంసీ రేణుక, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం, వరంగల్ జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, వివిధ మండలాల నుంచి హాజరైన అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో వైద్యుల, సిబ్బంది కొరతతో ప్రజలకు ఇబ్బందులు





**30 పడకల ఆసుపత్రి,108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని మండల ప్రజల విజ్ఞప్తి**

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ (16):

సుమారు 35 ఏళ్ల క్రితం నర్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహణతో గుర్తింపు పొందిన శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం వైద్యులు,సిబ్బంది కొరతతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.రోజుకు సుమారు 150 మంది వరకు ఓపీ నమోదవుతున్నప్పటికీ, తగినంత సిబ్బంది లేక గర్భిణీలు,మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శివ్వంపేట మండల పరిధిలో 37 గ్రామపంచాయతీలకు చెందిన 56 గ్రామాలు,25 గిరిజన తండాలు ఉన్నాయి.ఇంత పెద్ద జనాభాకు సేవలు అందించే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా,ఒకరు బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం మండల వైద్యాధికారి డాక్టర్ సాయి సౌమ్య ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు.దీంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడం కష్టంగా మారింది. ఆసుపత్రిలో ఏడాదికిపైగా ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉండగా,నాలుగు ఏఎన్ఎం పోస్టులు కూడా భర్తీ కాలేదు.అటెండర్ సెలవుపై వెళ్లడంతో ఆసుపత్రి నిర్వహణ మరింత ఇబ్బందికరంగా మారింది. గత సుమారు 20 ఏళ్లుగా ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో గర్భిణీలు, ముఖ్యంగా గిరిజన మహిళలు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ అప్పుల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
మండలంలో అధిక సంఖ్యలో గ్రామాలు,గిరిజన తండాలు ఉన్నప్పటికీ 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలు, ఇతర రోగులు ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో శివ్వంపేటలో నర్స్ ట్రైనింగ్ సెంటర్ ఉండేది. ప్రస్తుతం కేవలం 12 గంటల వైద్య సేవలే అందుబాటులో ఉండడంతో రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. మంజూరైన 108 అంబులెన్స్ ఇతర మండలానికి తరలింపు ఆరు నెలల క్రితం శివ్వంపేటకు మంజూరైన 108 అంబులెన్స్‌ను మాసాయిపేటకు తరలించినట్లు సమాచారం. దీంతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ అందుబాటులో లేక గర్భిణీలు,గిరిజనులు ఆటోల ద్వారా ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి రోజురోజుకు పెరుగుతున్న ఓపీ సంఖ్య,మండల జనాభా,గ్రామాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా అదే జిల్లాకు చెందిన దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో,శివ్వంపేట పీహెచ్‌సీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఖాళీగా ఉన్న వైద్యులు,ఫార్మసిస్టు, ఏఎన్ఎం,ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి,24 గంటల వైద్య సేవలుపునరుద్ధరించడంతో పాటు 108 అంబులెన్స్‌ను శివ్వంపేటకు కేటాయించాలని కోరుతున్నారు.

# ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





ఖరీఫ్ 2026–27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.
బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్‌లతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 98,539 ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 90,523 ఎకరాల్లో 7 రకాల సన్న వడ్లు, 8,016 ఎకరాల్లో దొడ్డు రకం వడ్లు సాగు చేసినట్లు తెలిపారు.
వీటి ఆధారంగా సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 209 ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు (ప్రాజలు) ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు తదితర పరికరాలను ముందుగానే సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
ధాన్యం నిల్వకు సరిపడా గోడౌన్లను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు.
జిల్లాకు సుమారు 37.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా, ఇప్పటివరకు 10 లక్షల గన్నీ బ్యాగులు సమకూరినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన గన్నీ బ్యాగులను కూడా సకాలంలో సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం సకాలంలో తరలించేందుకు సరిపడా వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.
కొనుగోలు కేంద్రాల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డీఎం సివిల్ సప్లైస్ సంధ్యా రాణి, డీసీఎస్‌ఓ కిష్టయ్య, డీఆర్‌డీఏ నాగ పద్మజ , డీసీఓ నీరజ,, డీఏఓ, ఆర్‌టీఓ, మార్క్‌ఫెడ్ డీఎం, వరంగల్ ఆర్డీఓ సుమ, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి సంబంధిత మండలాల ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలు, ప్యాడీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

**ఖిలా వరంగల్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, డాక్టర్ సత్యశారద**

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న ఖిలా వరంగల్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. బుధవారం ఖిలా వరంగల్‌ను సందర్శించిన ఆమె కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి తెలంగాణ బోర్డు వైస్‌చైర్మన్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, బారికేడింగ్, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాంగణంలో పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.
ఈ సందర్భనలో ఆర్డీవో వరంగల్ సుమ,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.




## హనుమకొండ నేడుతెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

మన మీ వార్త సెప్టెంబర్ 16 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

అదాలత్ సర్కిల్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్న రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు. సెప్టెంబర్ 17వ తేదీ (గురువారం)తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతుండగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. గురువారం ఉదయం 9 గంటల 48 నిమిషాలకు అదాలత్ సర్కిల్ లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని అమరులకు రాష్ట్రమంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు నివాళులు ఘటించనున్నారు
అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జరిగే ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండా ను ఆవిష్కరించి సందేశం ఇవ్వనున్నారు.

## బోన్లుతో కోతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న మాజీ జడ్పిటిసి మహేష్ గుప్తా



శివ్వంపేట మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ (16):

గ్రామంలో రోజురోజుకు పెరుగుతున్న కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడటంతో పాటు ఆహార పదార్థాలు, వస్తువులను ఎత్తుకెళ్లడం, పంటలు, కూరగాయల తోటలను ధ్వంసం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.ముఖ్యంగా ఉదయం,సాయంత్రం వేళల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉండటంతో చిన్నారులు,వృద్ధులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్న పరిస్థితి నెలకొంది.ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్త ఆధ్వర్యంలో బుధవారం కోతులను బంధించేందుకు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా సొంత నిధులతో దుర్గమ్మ దేవాలయం సమీపంలో ప్రత్యేక బోన్లను ఏర్పాటు చేశారు. కోతుల బెడద కారణంగా ప్రజలకు,ముఖ్యంగా రైతులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు మాజీ జెడ్పిటిసి మహేష్ గుప్తా పేర్కొన్నారు. గ్రామంలోని ఇతర ప్రాంతాల్లోనూ కోతుల సంచారం ఎక్కువగా ఉన్నందున అవసరమైన చోట్ల మరిన్ని బోన్లు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చర్యలు చేపడతామన్నారు.
కార్యక్రమంలో సర్పంచ్ రాజపేట వెంకటేశ్వర్,ఉప సర్పంచ్ మల్లేష్,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి

**హనుమకొండ జిల్లా జాక్ అధ్యక్షుడిగా సనత్‌కుమార్ పటేల్ నియామకం**



తెలంగాణ సర్పంచుల సంఘం జాక్--2026 సర్పంచుల సంఘం జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు విరసనోళ్ల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా శాతరాశి సనత్‌కుమార్ పటేల్‌ను నియమించారు. ఈ సందర్భంగా సనత్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సర్పంచుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణతో పాటు గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సర్పంచుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం జాక్ ఆధ్వర్యంలో సమష్టిగా పోరాడుతామని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో అందరి సహకారంతో సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## జ్యోతిరావు కాలనీలో గణనాథునికి ప్రత్యేక పూజలు

**- చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు**

జవహర్ నగర్, సెప్టెంబర్ 16: (వార్త ప్రతినిధి)



మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ డివిజన్ జ్యోతిరావు కాలనీలో చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి కట్కూరి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ప్రత్యేక హారతి సమర్పించారు. ఈ సందర్భంగా కట్కూరి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాలనీ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## ఘనమైన అన్నదాన కార్యక్రమం



పరకాల ప్రతినిధి మన మీ వార్త

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాజీ యువసేన గౌరవాధ్యక్షులు ఆర్ పి జయంత్ లాల్ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ వద్ద ఏర్పాటుచేసినటువంటి గణేష్ మండపం వద్ద హనంకొండ జిల్లా పరకాల ఈరోజు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్సవ సమితి అధ్యక్షులు నాగ బండి విద్యాసాగర్ విచ్చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శివాజీ యువసేన ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు నిర్వహించడం ఎంతో అభినందనీయమని భక్తి పరవశంతో ప్రతి ఒక్కరూ నవరాత్రులు జరుపుకోవాలని కోరారు యువసేన ఆధ్వర్యంలో మట్టి వినాయకుడు ఏర్పాటు చేయడం, ఎకో ఫ్రెండ్లీ ప్లేటు వాడడం,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు యువత ముందుకు వచ్చి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు

ఈ కార్యక్రమంలో అన్నదాతలు సూర రిషిత-రవి శివాజీ యువసేన నాయకులు కిరణ్ ,విజయ్ ,రవి ,తిరుపతి, రాజేష్ ,అఫ్రోజ్ ,నాగరాజు ,కాసిం ,వంశీ ,రాజు ,ఆనంద్, అర్జున్ ,జిల్లెల్ల రాజకుమార్ ,వినోద్ ,తదితరులు మరియు సుమారు 1500 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు

## పర్యాటక దినోత్సవం నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం

మన మీ వార్త సెప్టెంబర్ 16: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



వరంగల్ సెప్టెంబర్ 27 న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రజలకు పరిచయం చేసేలా, పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రదేశాల విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డియార్వో విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి,శ్రీఎవి జీవన్ ,కలెక్టరేట్ సూపరిండెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు

## మేడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన డీఐగా కే. శ్రీనివాస్ బాధ్యతలు

మేడిపల్లి సెప్టెంబర్ 16 (మన మీ వార్త)



మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ డిఐగా కే శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కంటోన్మెంట్ ఎస్ఓటి నుంచి బదిలీపై వచ్చిన ఆయన మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో నూతన డిఐగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్ డిఐగా విధులు నిర్వహించిన ఎలక్షన్ రెడ్డి కంటోన్మెంట్ ఎస్ఓటి కి బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో కే శ్రీనివాస్ ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## బీరంగూడ శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు

పటాన్ చేరు సెప్టెంబర్ 16 మీ వార్త ప్రతినిధి :

చేర్యాల రాజు కుటుంబ సభ్యులు..



వినాయక చవితి సందర్భంగా బీరంగూడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన గణనాధునికి చేర్యాల వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విఘ్నాల తొలగించే వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వరసిద్ధి ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

# మేడిపల్లి లో నీ 103 ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

- చెల్లిన పట్టాలకు (డబ్ల్యుపి) నెంబర్లు తో అక్రమ నిర్మాణాలు
- ఎమ్మార్వో ఆర్ఐ ల పైన పూర్తిస్థాయి విచారణ జరిపించాలి-ముడీ మార్టిన్

మేడిపల్లి సెప్టెంబర్ 16 (మన మీ వార్త)





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడిపల్లి మండలం తాసిహల్దార్లు నిర్లక్ష్యం వలన ప్రభుత్వ స్థలము అన్యాక్రాంతం పై ఎం సిపిఐ (యు) మండల కార్యదర్శి ముడి మార్టిన్ మేడిపల్లి తాసిహల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడిపల్లి మండలం పరిధిలోని సర్వేనెంబర్ 103 లోనీ ప్రభుత్వ స్థలం గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి అన్యాక్రాంతం అవుతున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న మేడిపల్లి ఎమ్మార్వోలు వచ్చినటువంటి ప్రతి ఒక్క ఎమ్మార్వో లు ప్రతి ఒక్క(ఆర్.ఐ) లు సంబంధిత సిబ్బందితో పాటు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నటువంటి వారికి సహకరిస్తున్నారని వారిపైన విచారణ జరిపించాలని 2002లో ఇచ్చిన పట్టాలను 2001 నుండి 2026 ఇప్పటివరకు ఇంకా కొనసాగుతున్నాయి, 2002లో ఇచ్చిన పట్టాలు దాని కాలపరిమితి దాదాపుగా ఒక సంవత్సరం ఉంటుంది. అలాంటిది 24 సంవత్సరాల తర్వాత కాలం చెల్లిన పట్టాలకు (డబ్ల్యుపి) నెంబర్లు తెచ్చుకొని యెతెచ్చాగా నిర్మాణాలు జరుగుతుంటే వచ్చిన ప్రతి ఎమ్మార్వో కు ఫిర్యాదు చేస్తుంటే నేను ఉన్నప్పుడు జరగడం లేదు, నాకన్నా ముందు జరిగిన వాటికి నేనెలా బాధ్యున్ని అవుతానని తప్పించుకుంటూ కాలయాపన చేసుకుంటూ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న ఎమ్మార్వో గారి పైన విచారణ జరిపించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజాప్రయోజనాల నిమిత్తం మై భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతారని మీపై పూర్తి విశ్వాసంతో తమరికి మనవి చేస్తున్నాను, అదేవిధంగా అక్రమ నిర్మాణదారులను 24 సంవత్సరాల నుండి మీరు ఇల్లు నిర్మించుకోకుండా ఇంతకాలం ఎందుకు కాలయాపన చేశారని అడగకుండా వాళ్లకు తగిన సలహాలు సహకారాలు అందించడం వలన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి, కనుక సంబంధిత మేడిపల్లి ఎమ్మార్వో గారి పైన మరియు ఆర్ఐ రాకేష్ గారి పైన విచారణ జరిపి అసలు ఈ పట్టాలు ఇంత కాలము ఎక్కడ ఉన్నాయి. 24 సంవత్సరాల తర్వాత బయటకి ఎలా వచ్చాయి దీనికి కారకులు ఎవరు విచారణ జరిపించి ఎమ్మార్వో, ఆర్ఐ వీరి పైన పూర్తిస్థాయి విచారణ జరిపించి వీరి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపినారు.

# ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు..

- హుజురాబాద్ అభివృద్ధికోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి రాజేశ్వర్ రావు..
- వేడుకల్లో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 16





హుజురాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజేశ్వర్ రావు అని వారు చేసిన పనులే ఇప్పటికీ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని,వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్ రావు జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకల్లో పలువురు ఆయన అభిమానులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా పలు అభివృద్ధి పనులు చేశారని,ఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటితరానికి కూడా ఉపయోగపడుతున్నాయని అన్నారు.అనంతరం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు, అధికార ప్రతినిధులు,అన్ని మండల,పట్టణ అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాలు,ప్రజా ప్రతినిధులు,బ్లాక్ కాంగ్రెస్,ఎస్సీ సెల్,బీసీ సెల్,మైనారిటీ,సేవాదళ్,సోషల్ మీడియా,అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా' స్కూళ్లను నాణ్యతతో చేపట్టాలి : కలెక్టర్

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 16, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోతంగల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్నస్కూల్ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు.

**అన్ని సౌకర్యాలతో..**

అకడమిక్, అడ్మిన్ బ్లాక్?లు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్, ఇండోర్ గేమ్స్, క్రికెట్ గ్రౌండ్, ప్లే గ్రౌండ్, టీచర్స్ క్వార్టర్స్, సెక్యూరిటీ బ్లాక్, పార్కింగ్ తదితర నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల వివరాలు ఆరా తీశారు. మైల్?స్టోన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. నిర్దేశిత సమయం లోపు పనులన్నీ పూర్తయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు.

**వసతులు కల్పించాలి**

ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్?లో సుమారు 2,500 మంది పైచిలుకు విద్యార్థులు, 300మంది వరకు బోధన, బోధనేతర సిబ్బంది ఉంటారని, వీరి అవసరాలకు సరిపడా మంచినీరు, డ్రైనేజీ వంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు, నాణ్యతా లోపాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కొడిచెర్ల ఇసుక క్వారీని సందర్శించారు. క్వారీలో అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్?కు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం నిబంధనలను అనుసరిస్తూ ఈ క్వారీ ద్వారా ఇసుకను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా గట్టి నిఘా ఉంచాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీవో విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమంలో విలేకరుల పాత్ర కీలకం

- విలేకరులకు బుల్లెట్ ట్రైన్ జ్ఞాపికలు అందజేసిన అఖిలపక్ష జేఏసీ నాయకులు బూర మల్సూర్ గౌడ్

మీ వార్త సెప్టెంబర్ 16 సూర్యపేట జిల్లా ప్రతినిధి





సూర్యాపేట: సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించాలనే లక్ష్యంతో అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి ప్రజలతో పాటు విలేకరులు అందిస్తున్న సహకారం, చేస్తున్న సేవలు అభినందనీయమని అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జిల్లా నాయకులు బూర మల్సూర్ గౌడ్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు కలిసి సూర్యాపేటలో పనిచేస్తున్న విలేకరులందరికీ బుల్లెట్ ట్రైన్ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా బూర మల్సూర్ గౌడ్ మాట్లాడుతూ.. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రావాలనే డిమాండ్‌తో ప్రారంభమైన ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఉద్యమం ప్రారంభం నుంచి విలేకరులు నిరంతరం వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అవసరాన్ని ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు, ఉద్యమాలపై వార్తలను నిరంతరం ప్రచురిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విలేకరుల సేవలను గుర్తించి ఈ జ్ఞాపికలను అందజేస్తున్నట్లు చెప్పారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలు, వ్యాపారులు, వివిధ సంఘాలు, కార్మికులు, యువతతో పాటు మీడియా ప్రతినిధుల సహకారం కూడా ఎంతో అవసరమని బూర మల్సూర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి నాయకులు, ధర్మార్జున్ ,భూపతి రాములు, పెద్దిరెడ్డి రాజా, వీరేందర్ , చల్లమల్ల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, కృష్ణ ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విలేకరులు పాల్గొన్నారు.

# టేకు చెట్లు నరికివేత కేసులో సాంపల్లి సర్పంచ్ భర్తకు జరిమానా

(మన మీ వార్త న్యూస్): సెప్టెంబర్ 16, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):

ఎలాంటి అనుమతి, నోటీసు ఇవ్వకుండా టేకు చెట్లకు జేసీబీతో తొలగింపజేసిన కేసులో డిచ్?పల్లి మండలం సాంపల్లి సర్పంచ్ సంధ్య భర్తకు అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన డిచ్‌పల్లి మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగింది..**

సాంపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనుల నిమిత్తం జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అంతరెడ్డి నర్సయ్య తన ఇంటి పక్కన చాలా ఏళ్లుగా పెంచుకుంటున్న టేకు వనాన్ని తొలగించారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే, గ్రామ సర్పంచ్ భర్త ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో 12టేకు చెట్లను జేసీబీతో తొలగించారని బాధితుడు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

**నేరుగా డీఎఫ్‌వోకు ఫిర్యాదు!**



ఏళ్ల తరబడి పెంచుకున్న టేకు చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంతరెడ్డి నర్సయ్య నేరుగా జిల్లా ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు చేశాడు. తాను చాలా ఏళ్లుగా పెంచుకుంటున్న టేకు చెట్లను సర్పంచ్ భర్త మాసూరి ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో జేసీబీ సహాయంతో తొలగించారని, చెట్లు తొలగించే క్రమంలో తనకు ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసు ఇవ్వలేదని, ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శిను సంప్రదిస్తే వివరణ ఇవ్వలేదని, వాల్టా చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు అంతరెడ్డి నర్సయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎఫ్‌వోకు అందిన ఫిర్యాదు నేపథ్యంలో ఇందల్వాయి ఎఫ్ఆర్‌వో రవి భట్ ఆదేశంతో అటవీ శాఖ రేంజ్, బీట్ అధికారులు సాంపల్లికి వెళ్లి క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు.

**రూ. 13వేల జరిమానా..!**

అనుమతి లేకుండా, వ్యక్తిగతంగా పెంచుకుంటున్న చెట్లను తొలగించడం చట్టరీత్యా నేరమని తేలడంతో.. సాంపల్లి సర్పంచ్ భర్త ప్రశాంత్‌కు రూ.13,325 జరిమానా విధిస్తూ అటవీ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ కేసులో పంచాయతీ కార్యదర్శి పేరును ప్రస్తావించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చెట్లు తొలగింపు ఘటన జూలై నెలలో జరగడంతో అప్పుడే ఫిర్యాదు చేసినప్పటికీ అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టకుండా తీవ్ర కాలయాపన చేశారని బాధితుడు నర్సయ్య వాపోతున్నాడు. అధికారం ఉంది కదా అని.. గ్రామంలో ఏం చేసినా చెల్లుతుంది' అనుకునే సర్పంచ్ భర్తకు, అటవీ శాఖ విధించిన ఈ జరిమానా ఒక గట్టి హెచ్చరిక అని గ్రామస్తులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

# కళాభారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 16, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ స్థలంలో నిర్మిస్తున్న కళాభారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. బుధవారం ఆయన ఆడిటోరియం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఐదంతుస్తులతో నిర్మాణం..**

సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేడుకల కోసం అధునాతన సదుపాయాలతో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్న భవన సముదాయం పనుల వివరాల గురించి ఆర్?అండ్?బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదిక, రెండు బ్యాంకెట్ హాల్స్, సుమారు 1400 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫ్రేమ్ వర్క్ పూర్తయినందున మిగతా పనులను కూడా వేగవంతంగా జరిపించాలని కలెక్టర్ సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలో సరైన వేదికలు లేనందున కళాభారతి ఆడిటోరియం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నాణ్యతతో



జరిగేలా చూడాలన్నారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు.

# రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలతో పోరాటలను అడ్డుకోలేరు







సిఐటియు జిల్లాకార్యదర్శి ఎ.జె.రమేష్

నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ సామూహిక దీక్షలు

**భద్రాద్రి :** సమరశీలపోరాటలకు సందంకండి పోరాటాల కు అండగావుంటాం ధీక్షలకు జూవీ,దీ=ాసహా ప్రజాసంఘాల మద్ధతుఈరోజు సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ లో కార్మిక ప్రజా పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి అధ్యక్షులు జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించి మాట్లాడారు.లి లిగత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చి అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినప్ప టికీ, కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలలోఒక్కహామీనికూ డచేయలేదన్నారు.కార్మికులకుఇచ్చినహామీల అమలు పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది విమర్శించారు. కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన – పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. అర్ధరాత్రి పూట మహిళాకార్మికులఇండ్లకు వెళ్ళి దౌర్జన్యపూరితంగా వ్యహరిస్తు న్నారని పెర్కొన్నారు. మహిళాకార్మికులంటే ప్రభుత్వానికి చులకన భావంవుందన్నారు. నిర్బంధం ఇదే రూపంలో కొనసాగిస్తే ప్రతిఘటన కూడా తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు భవిష్యత్తులో మరిన్ని సమరసిల పోరాటాలకు కార్మిక వర్గం సమయతమవుతుందని పేర్కొన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని రాష్ట్రంలోని ప్రతి కార్మికుడికి పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు సమస్యల పరిష్కారం కోసం సిఐటియు తోటి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే గత పాలకులకు పట్టిన పరిస్థితి ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో కనీసం ధర్నా చేసుకునేందు కు కూడా అనుమతిని నిరాకరిస్తున్నారు. ఇది కార్మికుల హక్కులను అప్రాజాస్వా మికంగా నిరాకరించటమేనని, ఇది ఎంతమాత్రం ఆమోదయో గ్యం కాదనిఅన్నారు. కార్మిక పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు . లి2026 సెప్టెంబర్ 8,9తేదీల్లో జరిగిన అంగన్వాడీ,ఆశా రెండు సంఘాల "ఛలో హైదరాబాద్" పిలుపులను భగ్నం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ పడరాని పాట్లు పడింది. వివిధ జిల్లాల్లో నాయకులను ఇండ్ల వద్దే ముందు రోజు రాత్రే అరెస్టులు చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులను సైతం తెల్లవారిఝాము నుండే వేటాడారు. వందలాది మంది పోలీసులు తమ బలగాలతో వచ్చి అక్రమ ముందస్తు అరెస్ట్ లకు పాల్పడుతున్నారు. పోలీసుల చర్యల మూలంగా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా పనిచేస్తున్న సిఐటియు నాయకులను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించడమే. అన్నారు.నిర్భందాన్నిఅరెస్టులను ఖండించారు. కార్మిక హక్కులపై కాంగ్రెస్ దాడి చేస్తుందని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలకు కొత్తగూడెంలో సంఘీభావం తెలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకం మినహా ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదు. ఆశా వర్కర్స్ రూ.18,000/–ల ఫిక్స్డ్ వేతనం, పిఎఫ్ సౌకర్యం అమలు,గ్రామ పంచాయితీ, మున్సిప ల్, విద్యుత్, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్, బిల్డింగ్, హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు డిమాండ్ చేశారు. సమస్యలపరిష్కారంకోసం ఆందోళన– పోరాటాలు చేస్తుతన్నకార్మికులతోబాధ్యత కల్గిన రాష్ట్ర ప్రభుత్వం చర్చలుజరిపికార్మిక సమస్యలను పరిష్కరిం చాలని ,రైతు సంఘం ,జిల్లాకార్యదర్శి అన్నవరపు సత్యనారయణ, వ్యవసా య కార్మికసంఘంజిల్లా అధ్యక్షులు అన్నవరపుకనకయ్య నాయకులు సంజీవ్, ఐద్వానాయకు లక్ష్మి నాయకులు బాలరాజు,హరికృకష్ణ నాయకులు నాగకృష్ణ,ు=ా నాయకులు సురేష్,డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించకుండా ఆందో ళనా–పోరాటాలు నిర్వహిస్తున్న కార్మికులను అణచివేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించటాన్నిఖండించారు. సామూహిక దీక్ష ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా జిల్లా కోశాధికారి జి పద్మ జిల్లా ఆఫీస్ బేరర్లు పిట్టల అర్జున్ దొడ్డ రవికుమార్ ఈసం వెంకటమ్మ భూక్య రమేష్ గద్దల శ్రీను సత్య రాజేష్ ధనలక్ష్మి జూవీనాయకులు మం.బి.నర్సారెడ్డి పాల్గొన్నారు దీక్షలో వందలాది మంది కార్మికులు కూర్చున్నారు కూర్చున్నారు.

# ఆసిఫాబాద్ మండల సర్పంచులతో ఆత్రం సుగుణక్క సమావేశం

గ్రామాల అభివృద్ధి, సర్పంచుల సమస్యలపై చర్చ



**ఆదిలాబాద్ :–** ఆసిఫాబాద్ జిల్లా మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులతో డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర అభివృద్ధి అంశాలపై సర్పంచులతో చర్చించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.అలాగే పంచాయతీ రాజీవ్ గాంధీ సంఘటన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని సర్పంచులకు రోజ్ గార్డెన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆత్రం సుగుణక్క తెలిపారు. సర్పంచుల హక్కులు, వారు నిర్వహించాల్సిన విధులు, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, పంచాయతీ పాలనకు సంబంధించిన ఇతర అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ రాష్ట్ర అబ్జర్వర్ సుభాష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని ఆత్రం సుగుణక్క సూచించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రాపర్తి మురళి, డీసీసీ ఉపాధ్యక్షులు తారిక్, డీసీసీ కార్యదర్శి పెందోర్ సుధాకర్, సర్పంచ్‌ల సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు అంకుసాపూర్ సర్పంచ్ తేకం గంగారాం, సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి రాజన్న, రౌట సంకేపల్లి సర్పంచ్ ఆత్రం కొండూ, తుంపల్లి సర్పంచ్ ఈశ్వరి, వెంకటాపూర్ సర్పంచ్ నీలాబాయి, మోవాడ్ సర్పంచ్ సుగుణ, చిల్లటి గూడ వినోద్, బాబాపూర్ సర్పంచ్ సత్రవేణి రాజన్న, చోర్పల్లి సర్పంచ్ సుకరి పెంటు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో 'బేటీ బచావో--బేటీ పడావో' పోషకాహార అవగాహన సదస్సు





**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ ) నందు మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో--బేటీ పడావో' పథకంలో భాగంగా బుధవారం విద్యార్థినులకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ, కిశోర బాలికలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బాలికల విద్య, సంరక్షణతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, బేటీ బచావో--బేటీ పడావో లక్ష్యాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని సూచించారు.అనంతరం పోషణ అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిత్య జీవితంలో స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా విద్యార్థినులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ చురుగ్గా రాణించవచ్చని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినులకు న్యూట్రిషనల్ కిట్ అందచేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి (ఎస్ ఓ ) సరస్వతి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# బోర్‌వెల్ మోటార్ వైర్ల చోరీకి యత్నం భగ్నం

**ముగ్గురితో పాటు 16 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**షాబాద్ :–** షాబాద్ మండలం సంకేపల్లిగూడ గ్రామ శివారులో బోర్‌వెల్ మోటార్ వైర్లను కోసి చోరీ చేసేందుకు యత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు 16 ఏళ్ల బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో చోరీకి యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిని రామావత్ కిషన్, ఎస్లావత్ నరేష్, తేజావత్ చరణ్‌తో పాటు 16 ఏళ్ల బాలుడిగా గుర్తించారు. అనంతరం వారిని షాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. చట్టపరమైన ప్రక్రియ అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు షాబాద్ పోలీసులు తెలిపారు.

# శంకర్‌పల్లిలో ప్రారంభమైన వినోదాల ప్రదర్శన

**అమ్యూజ్‌మెంట్ పార్క్ అండ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్**





**శంకర్‌పల్లి :–** శంకర్‌పల్లి పట్టణ పరిధిలోని హైదరాబాద్ రోడ్డులో సౌత్ ఇండియన్ అమ్యూజ్‌మెంట్ పార్క్ అండ్ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి పట్టణంలో తొలిసారిగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకుల వివరాల ప్రకారం ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల రైడ్స్, వినోదాత్మక ఆటలు, ఫుడ్ కోర్ట్, షాపింగ్, వినోద కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రవేశ రుసుము రూ.30గా నిర్ణయించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు, వారాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, ఎస్సై దేవేందర్, కౌన్సిలర్లు ఫైముదా బేగం, సమీ, గిరిజ చంద్రశేఖర్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం




ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేరెంట్ కంపెనీ మెటాకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై వినియోగదారులకు ఏ కంటెంట్ లేదా సమాచారం ఎక్కువగా కనిపించాలో/చేరాలో నిర్ణయించడానికి అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నప్పుడు, మెటాను కేవలం సమాచారం చేరవేసే సాధారణ మధ్యవర్తిగా (ఇంటర్మీడియరీ) చూడలేమని ప్రభుత్వ వర్గాలు బుధవారం స్పష్టం చేశాయి. అదొక సర్వీస్ ప్రొవైడర్ కిందికి వస్తుందని, అలానే పరిగణించాలని పేర్కొన్నాయి. మిగతా సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగానే మెటాకు కూడా చట్టపరంగా ఎన్నో బాధ్యతలు ఉంటాయని, ఇక మీదట తన ప్లాట్‌ఫామ్ కంటెంట్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని వెల్లడించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ చట్టాల ప్రకారం సోషల్ మీడియా కంపెనీలకు లభించే సేఫ్ హార్బర్ ఇమ్యూనిటీ లేదా చట్టపరమైన రక్షణపై కీలక వ్యాఖ్యలు చేసింది. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్నందున, దానికి లీగల్ ఇమ్యూనిటీ వర్తించదని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ చట్టపరమైన సంరక్షణకు సంబంధించి తుది నిర్ణయం న్యాయస్థానాల చేతుల్లోనే ఉంటుందని, అది వాటి పరిధిలోని అంశం అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లోని లోపాలను, కంటెంట్ నియంత్రణలో జరిగిన పొరపాట్లను మెటా బహిరంగంగా ఒప్పుకుందని, ఈ క్రమంలోనే ఇప్పుడు మరింత జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని పేర్కొంది. 'ప్రతి సర్వీస్ ప్రొవైడర్‌కు కొన్ని బాధ్యతలు ఉంటాయి. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న కంటెంట్‌కు బాధ్యత వహించేందుకు అంగీకరించిన తర్వాత నెక్స్ట్ ఫేజ్‌లో మరిన్ని బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**నేరుగా 14జ సైబర్ క్రైమ్ పోర్టల్‌కే సమాచారం!**

అంతకుముందు ఆన్‌లైన్‌లో బాలల లైంగిక వేధింపుల కంటెంట్‌పై మెటా తన తప్పును అంగీకరించిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇక మీదట ఇలాంటి కంటెంట్‌పై భారతీయ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. డిజిటల్ వేదికల్లో పిల్లల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని, నేరస్థుల్ని చట్టం ముందు నిలబెట్టడానికి ఈ విషయంలో భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మెటా అధికార ప్రతినిధి వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై పిల్లల్ని రక్షించడం తమకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని తెలిపారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14జ) నిర్వహిస్తున్నటువంటి సైబర్ క్రైమ్ పోర్టల్‌కు చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసుల్ని నేరుగా నివేదించేందుకు మెటా అంగీకరించింది.

ఇప్పటివరకు ఇలాంటి చైల్డ్ సేఫ్టీకి సంబంధించిన కేసుల్ని మెటా అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రెన్ సంస్థకు రిపోర్ట్ చేసేది. ఇప్పుడు భారత్‌లోని చట్టాలకు అనుగుణంగా ఇక్కడ భారతీయ పోర్టల్‌కే సమాచారం ఇచ్చేందుకు ఒప్పుకుంది. అయితే ఇక్కడ భారతదేశంలో చట్ట అమలు సంస్థలకు నేరుగా రిపోర్ట్ చేసేందుకు అంగీకరించిన తొలి గ్లోబల్ టెక్ దిగ్గజం మెటానే కావడం విశేషం.

**నిబంధనలు పాటించకపోతే అంతే సంగతులు!**

భారత్‌లో ఆన్‌లైన్ భద్రత, చైల్డ్ అబ్యూస్ కంటెంట్, డీప్‌ఫేక్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఇటీవల మరింత నిఘాను పెంచింది. నిబంధనలు పాటించకపోతే ఏమాత్రం ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ మెటా అంతర్జాతీయ ఉన్నతాధికారులను కొద్ది రోజుల కిందట భారత్‌కు పిలిపించి కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ విచారించింది. ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ యాడ్స్ ద్వారా చిన్నారుల అశ్లీల కంటెంట్‌ను (చైల్డ్ అబ్యూస్ మెటీరియల్) ప్రోత్సహిస్తున్నారని, ప్రచారం చేస్తున్నారన్న వార్తలపై జులైలోనే ప్రభుత్వం మెటాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే ఆ ప్రకటనలను తొలగించి వివరణ ఇవ్వాలని కూడా ఆదేశించింది. జులై 3న జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్- చీజూజ=) కూడా సుమోటా కింద మెటాకు నోటీసులు జారీ చేసింది. మెటా సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా ఇక్కడ మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, హెడ్‌ను వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వారం వ్యవధిలోనే రెండోసారి మెటా ఇండియా అధికారులు బుధవారం రోజు కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు.

# భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు




భారత్, అమెరికా సైన్యాల మధ్య వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని ఔలీలోని ఫారిన్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలతో పాటు సైనిక విన్యాసాలను నిర్వహించారు. ఆ డ్రిల్‌లో ఇరుదేశాలకు నుంచి సుమారు 600 మంది సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌తో పాటు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆ విన్యాసాలు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఔలీలో జరిగిన ప్రారంభోత్సవంలో భారత సైన్యానికి చెందిన 14వ పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అమరేశ్ గుంజన్, అమెరికా సైన్యానికి చెందిన 11వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌లోని 1వ పదాతిదళ బ్రిగేడ్ కంబాట్ టీమ్ కమాండర్ కల్నల్ బెన్ జాక్‌మన్ పాల్గొన్నారు. ఆ విన్యాసాలు ఇరుపక్షాలకు కార్యాచరణ పద్ధతులను అంచనా వేసుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాన్ని కల్పిస్తాయని భారత సైనిక అధికారి జనరల్ అమరేశ్ గుంజన్ పేర్కొన్నారు. ఇరుదేశాల సైన్యాల మధ్య బంధాన్ని బలపరుస్తుందని, ఎలాంటి పరిస్థితులలోనైనా కలిసి విజయం సాధించడానికి సిద్ధం చేస్తుందన్నారు. మరోవైపు, అమెరికా సైనిక అధికారి బెన్ జాక్‌మన్ కూడా మట్లాడారు. ఆ డ్రిల్స్? ఇరుదేశ సైనిక దళాల మధ్య మరింత నమ్మకాన్ని పెంపొందించుకోవడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. పర్వత ప్రాంతాల్లో ఉమ్మడి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే విన్యాసాల ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ ఉమ్మడి ప్రణాళికలు రచించడం, కార్యాచరణ అమలు, యుద్ధ నైపుణ్యాలు వంటి వాటిపై రెండు దేశాల సైన్యాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని అన్నారు.

**ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా ఫోకస్**

యుద్ధ అభ్యాస్? 2026 విన్యాసాల్లో ఈసారి ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నిఘా, శత్రువుల కదలికలను కనిపెట్టే ఆపరేషన్ల కోసం దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన జరగనుంది. ఆ కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సైనిక అవసరాలు, మిలిటరీ టెక్నాలజీకి సంబంధించి ఇరుదేశాల సైనిక నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అదేవిధంగా, ఔలిలో పర్వత ప్రాంత యుద్ధ శిక్షణ, అలాగే మహాజన్‌లో ఫీల్డ్ ఫైరింగ్ విన్యాసాల ద్వారా రెండు దేశాల సైన్యాలు తమ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. వీటి ద్వారా ప్రతికూల పరిస్థితులలో తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటాయి.

**'ఇరుదేశాల సైనికులు కలిసి శిక్షణ పొందుతారు'**

మరోవైపు, భారత్?- అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలపై భారత్?లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రానున్న రెండు వారాల్లో, అమెరికా, భారత సైనికులు కలిసి శిక్షణ పొందుతారు. ఈ క్రమంలో ఇరుదేశాల సైనికులు తమ నైపుణ్యాలను పంచుకుంటూ, సంసిద్ధతను పెంచుకుంటారు. అలాగే, ఇరుదేశాల సైనికుల మధ్య సహకారాన్ని మెరుగుపరుచుకుంటారు" అని? పోస్టులో రాసుకొచ్చారు.

**పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు సువర్ణావకాశం**

ఇదిలా ఉండగా, ఔలీ ప్రాంతం సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉంటుంది. అంతేకాదు, సవాలుతో కూడిన భౌగోళిక పరిస్థితులను కలిగి ఉంటుంది. ఈ భూభాగం పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి. అదే సమయంలో భారత సైనికులకు కూడా అమెరికా సైన్యం అవలంభిస్తున్న ఆధునిక పోరాట పద్ధతులు, ఆపరేషన్? పద్ధతులను నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

కాగా, యుద్ధ అభ్యాస్ 2026 సైనిక డ్రిల్స్ సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యాయి. ఈసారి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి జరుగుతున్నాయి. ఆ విన్యాసాలు రెండు వారాల పాటు జరిగి సెప్టెంబర్? 28న ముగియనున్నాయి. భారత్, అమెరికా మధ్య ఏటా ఈ విన్యాసాలు జరుగుతుంటాయి. ఇరుదేశాల మధ్య రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంలో డ్రిల్స్? కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి భౌగోళిక వాతావరణంలో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఇరు దేశాల సైన్యాలు కలిసికట్టుగా, సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు విన్యాసాలు దోహదపడనున్నాయి.

# రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై బ్యాంక్ ఛార్జీలు ఉండవు

**న్యూఢిల్లీ :** యూపీఐ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ.2,000 వరకు జరిగే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే రూ.2,000 వరకు ఖీబీఖజీఎ డెబిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపులపైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంది.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఖజీఎఎవనిబి జీనిట నావబిబిశ్రీవఎవనిబి నాఎబబివఎబ ంఇఃబి కింద నిబంధనల్లో మార్పులు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.రూ.2,000 వరకు యూపీఐ రూపీ డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసే వ్యక్తుల నుంచి బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష ఛార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం తెలిపింది. చెల్లింపు చేసే వ్యక్తితో పాటు చెల్లింపు స్వీకరించే వ్యక్తిపై కూడా ఇలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది.ఈ లావాదేవీలను ప్రభుత్వం అధికారికంగా "ఎలక్ట్రానిక్ మోడ్ ఆఫ్ పేమెంట్"గా వర్గీకరించింది. చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని గత నెలలోనే ప్రభుత్వం వెల్లడించింది.




ముఖ్యంగా లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని యూపీఐ లావాదేవీలకు వర్తించే విధంగా ఎలాంటి విధించబోమని స్పష్టం చేసింది.భవిష్యత్తులో నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని యూపీఐవ్యాపార లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఛార్జీలు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం వర్తించే పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉంటాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపులకు వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా చిన్న మొత్తాల చెల్లింపుల్లో అదనపు ఛార్జీల భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేయడంతోయూపీఐ వినియోగం మరింత సులభంగా కొనసాగనుంది.

## మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్




సౌదీ అరేబియాలోని మక్కా సమీపంలో చోటుచేసుకున్న డ్రోన్ దాడి యత్నాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. సౌదీ అరేబియా రక్షణ దళాలు ఈ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఆ ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలు ఆందోళనకరమని భారత విదేశాంగ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు మక్కా అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. అలాంటి పవిత్ర ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి యత్నించడం అత్యంత ఆందోళనకరమైన విషయం" అని వ్యాఖ్యానించారు. సౌదీ అరేబియా సార్వభౌమాధికా రానికి భంగం కలిగించేలా, పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా సాగుతున్న ఈ దాడులను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం త్వరితగతిన నెలకొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ వైమానిక దళాలు ప్రాథమిక దశలోనే గుర్తించాయి. మక్కా నగరంలోని నిషిద్ధ గగనతలంలోకి అది ప్రవేశించకముందే గాలిలోనే అడ్డగించి ధ్వంసం చేశాయి. ఈ హేయమైన చర్యను సౌదీ సంకీర్ణ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కి అల్ మల్కి తీవ్రంగా పరిగణిస్తూ, ఇదొక ప్రణాళికాబద్ధమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఉమ్రా యాత్రికులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ముస్లింల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రెండు పవిత్ర మసీదుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, దీనికి విఘాతం కలిగించే హౌతీలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. 2017లో బాలిస్టిక్ క్షిపణితో దాడి చేసిన తర్వాత, మక్కాను లక్ష్యంగా చేసుకోవడం ఇది రెండోసారి అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్‌లాండ్, నార్వే, నమీబియా, యూకే వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్థాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145) పొందిన దేశంగా నిలిచింది. ఇరాన్(144), పాకిస్థాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

డబ్ల్యూఈఎఫ్ సూచిక ప్రకారం, 2006లో తొలిసారి తాము తొలిసారి విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌ను, తాజా సూచికతో పోల్చింది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్. ప్రపంచంలోనే అత్యధిక జనాభా (సుమారు 150 కోట్లు) ఉన్న భారత్‌లో 'ప్యారిటీ స్కోర్' 64.5 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ. గతేడాదితో పోలిస్తే భారత్ 'ప్యారిటీ స్కోర్' కొద్దిగా మెరుగుపడింది. మొత్తంగా 2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. దీనికి ప్రధాన కారణం విద్యా రంగంలో సాధించిన పురోగతి అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది.

ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో దేశ ప్యారిటీ స్కోర్ మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. ఆరోగ్య- జీవన స్థితిగతుల విభాగంలోనూ ఈ ఏడాది భారత్ మెరుగైన ప్యారిటీ స్కోర్‌ను సాధించింది.

'పూర్తి సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుంది'

2006 నుంచి తాము పర్యవేక్షిస్తున్న దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థ లింగ సమానత్వంలో పురోగతి సాధించిందని జెనీవాకు చెందిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తెలిపింది. అయితే పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవులలో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

**ఏఐ రంగంలో కూడా మహిళలు తక్కువే!**

అలాగే కృత్రిమ మేధ (ఏఐ) ఇంజినీర్లలో ప్రతి ఐదుగురిలో ఒకరి కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జాహిది తెలిపారు. ఏఐ సంస్థలలో ప్రతి స్థాయిలో మహిళ ప్రాతినిధ్యం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాల డేటా ప్రకారం అన్ని దేశాలు లింగ సమానత్వం సాధించవచ్చని తెలుస్తోందన్నారు. సమానత్వం అనేది వృద్ధికి, పోటీతత్వానికి పునాది అని అభిప్రాయపడ్డారు.

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

సీనియర్ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను.. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగర్‌కట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా, ఆర్.కె. నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను, గత ఏడాది (2025) భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# ధరణి పేరిట దోపిడీ

-మొదటిపేజీ తరువాయి

కాపాడేందుకు 1 ఆఫ్ 70 చట్టం తెచ్చింది. 1 ఆఫ్ 70 చట్టం ద్వారా గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనడం నిషిద్ధం. భూమి మీద తెచ్చిన చరిత్రాత్మక చట్టం ల్యాండ్ సీలింగ్ యాక్ట్. మిగులు భూములను పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పంచిపెట్టింది. 1975లో అసైన్డ్ భూముల అమ్మకాలను నిషేధిస్తూ చట్టం తెచ్చింది. 2006లో అటవీచట్టం తెచ్చి పోడు భూములను సాగు చేసుకునేవారికి అండగా నిలిచింది. 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ఇందిరాగాంధీ పేదలకు పంచి పెట్టారు. పది లక్షల ఎకరాల పోడు భూములను పేదలకు పంచారు"

**రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది**

భూముల సమస్య వారసత్వంగా ఎలా వచ్చిందనే దానిపై చర్చ చేపట్టాలని, నిజాం సర్కారు, ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలపై చర్చ చేపట్టాలని, తెలంగాణ ఏర్పాటు, 22ఏ జాబితా సమస్యలు, కోర్టు తీర్పులు అంశాలపై చర్చ చేపట్టాలని రేవంత్ రెడ్డి కోరారు. కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలను సభ ముందుంచుతామని స్పష్టం చేశారు. ధరణి పేరిట దోపిడీ రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారిందని, నిషేధిత భూముల సమస్యను మరింత జఠిలం చేశారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సృష్టించిన భూతం అందరినీ మింగేస్తుందని తప్పుడు ప్రచారం చేశారని, పొంగులేటిపై కక్షాపూరిత ఆలోచనతో అబద్ధాలు ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలకు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వం కారణం కాదని, శ్రీనివాస్‌రెడ్డిది ఎంత బాధ్యతో ప్రభుత్వానిది అంతే బాధ్యతని తెలిపారు. వారసత్వ సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

**ఎకరాలు గజాలుగా మారినపుడు భూమి తగ్గిపోయింది**

నిజాం సర్కారు హయాంలో 60 శాతం దివానీ భూములేనని, 60 శాతం భూముల్లో ఆదాయం ప్రభుత్వం తీసుకుని అభివృద్ధికి వాడేదని, నిజాం హయాంలో 40 శాతం భూములు నాన్ దివానీ కింద ఉండేవని సీఎం తెలిపారు. 40 శాతం భూముల్లో వచ్చే ఆదాయాన్ని నిజాం కుటుంబానికి వాడుకున్నారని, అద్భుత పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు నిజాం సర్కారని కొనియాడారు.

నిజాం వద్ద ఉన్న 40 శాతం భూములు జాగీర్దార్లు, సర్ఫేఖాస్ వద్ద ఉండేవని, నిజాం సర్కారు 60 శాతం భూములను కొలిచి హద్దులు నిర్ణయించారని పేర్కొన్నారు. నిజాం అధీనంలో ఉన్న 40 శాతం భూములు ఎన్ని అనేది సరిగా తెలియదని, ఎకరాలు గజాలుగా మారినపుడు భూమి తగ్గిపోయిందని, ప్రభుత్వ భూముల నుంచి ప్రైవేటుకు మారడం వల్ల సమస్యలని, 1948 నుంచి 1954 వరకు భూముల వివరాలు నమోదు చేశారని వెల్లడించారు. ఆరేళ్లపాటు వివరాలు నమోదు చేసి చసాల్ పహానీ రూపొందించారని, ఇప్పటికీ మనకు ఉన్న అధికారిక రికార్డులు కాస్రా పహానీయేనని, కాస్రా పహానీలో అనుమానం వస్తే చసాల్ పహానీ వెతుకుతారని పేర్కొన్నారు.

**పార్టీలతో సంబంధాలు ముగుస్తాయి**

ఆదర్శంగా ఉండాల్సిన నేతలు వికృత చేష్టలతో వ్యవహరిస్తున్నారని, సభ అధ్యక్షుడికి ఇచ్చే గౌరవం మేరకు సభ నడుస్తుందని అన్నారు. స్పీకర్‌గా ఎన్నుకున్నాక పార్టీలతో ఉన్న సంబంధాలు ముగుస్తాయని, సభలో ఉన్న ప్రతి సభ్యుడి హక్కులు కాపాడేందుకు స్పీకర్ కృషిచేస్తారని కొనియాడారు. సభ నిర్వహణపై గత ప్రభుత్వం కమిటీ నియమించి నిబంధనలు పెట్టారని, సభలో ప్లకార్డులు, నినాదాల ఫ్లెక్సీలు, నినాదాల దుస్తులతో రావొద్దని నిబంధన పెట్టారని గుర్తు చేసుకున్నారు. గత నిబంధనలు అమలు చేయాలని స్పీకర్ అసెంబ్లీ సెక్రటరీ ద్వారా పోలీసులను ఆదేశించారని, స్పీకర్ ఆదేశాలను పోలీసులు అమలు చేస్తున్నారని తెలిపారు.

**మహిళలను కించపరిచేలా వ్యవహరించారు**

పార్లమెంటు నిబంధనలను స్పీకర్ అమలు చేస్తున్నారని, నినాదాల దుస్తులతో రాకూడదని స్పీకర్ ఆదేశిస్తే ఎవరూ రాకూడదని, రాహుల్, ప్రియాంక, ఖర్గే ఎవరైనా స్పీకర్ ఆదేశాలు పాటించాల్సిందేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ నిబంధనల మేరకు సభను స్పీకర్ నిర్వహిస్తారని, నిబంధనలు లేకపోతే పార్లమెంటు నిర్వహణను అనుసరిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద పోలీసులు,



మహిళలను కించపరిచేలా వ్యవహరించారని, అర్ధనగ్న ప్రదర్శనలతో పోలీసులను దూషించారని, సభ అధ్యక్షుడిపై కూడా అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. సభ్యులు క్షమాపణ చెప్పి లేవనెత్తిన అంశాలపై చర్చిస్తారని స్పీకర్ మైకు ఇచ్చారని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సభ్యులను సమావేశాల నుంచి బహిష్కరించారని తెలిపారు.

**ధరణి ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టారాజ్యంగా బదిలీ చేసుకున్నారు**

తెలంగాణ ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు.

**మాఫియా చేతుల్లోకి కోట్ల మంది డేటా**

2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**ఒడిశాలో మొదలైంది**

ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్ ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్ఎఫ్ఎస్ దక్కించుకుందని వివరించారు. ఐఎల్ఎఫ్ఎస్, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి**

అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు.

**త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం**

మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ), మొత్తం భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్- 1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు.

**భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారు**

హరీశ్‌రావుకు రంగనాయకసాగర్ పరిధిలో భూమి ఉందని, రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు భూమి కొన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ కోసం ఇరిగేషన్ శాఖ భూసేకరణ చేసిందని, హరీశ్‌రావు కొన్న భూమిని భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారని, రామంచ సర్వే నం.4.20 ఎకరాలకు గాను ఒక ఎకరం తీసుకున్నారని పేర్కొన్నారు. భూసేకరణ రైతలకు ఎకరాకు రూ.6.20 లక్షల చొప్పున చెల్లించిందని, హరీశ్‌రావు మాత్రం రైతుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ.5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు కూడా లేకుండా రోడ్డు వేయించుకున్నారని వెల్లడించారు.

**ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతా: రేవంత్‌రెడ్డి (జుూం దీప్తుతీఫ్)**

ధరణిని అడ్డుపెట్టుకుని హరీశ్‌రావు మామ, సోదరుడు 94 ఎకరాల భూమిని కొల్లగొట్టారని, హరీశ్‌రావు మామ కూడా 93.33 ఎకరాల భూమిని గౌరవ్ పురానా పేరు ఉంటే ఎం.హనుమంతరావు పేరు మీదకు మార్చారని సీఎం ఆరోపించారు. 2022లో రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్ మీదకు మార్చుకున్నారని, రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్‌లో హనుమంతరావు, హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు భాగస్వాములని తెలిపారు. సత్యం రామలింగరాజు ఆస్తులను కేటీఆర్ తీసుకున్నారన్న సీఎం హైకోర్టులో వివాదంలో ఉన్న సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని తెలిపారు. జన్వాడలో సర్వే నం.311లో ఇన్‌కంటాక్స్ సీజ్ చేసిన భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని అన్నారు. ఐటీ అటాచ్ చేసిన భూమి శతభిష కంపెనీ నుంచి బదిలీ అయ్యిందని, 2015లోకి ఆచంట మల్లన్న చేతుల మీదుగా కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని, శతభిష ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ అనేది సత్యం రామలింగరాజుకు సంబంధించిందని, 2019లో ధరణి కాంట్రాక్టు కట్టబెడితే జన్వాడ భూములు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు.

**కేసీఆర్ విచారణకు అడుగుతారా?**

జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి , సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారని అన్నారు. కిషన్‌రెడ్డి సొంతూరు తిమ్మాపూర్‌లో 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేటుపరమైందని, దామోదర్‌రావుకు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ బెంజి కారు ఇచ్చారని తెలిపారు. దామోదర్‌రావుకు బెంజికారు ఎందుకు ఇచ్చారో కేసీఆర్ విచారణకు అడుగుతారా? ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ మల్కం కొమురయ్య 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఆరోపించారు.

# పాలిటిక్స్ లోకి హైడ్రా రంగనాథ్.. పోటీ అక్కడి నుంచే..

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో చెరువులు.. కుంటలు.. నాలాల ఆక్రమణ లేకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరమీదకు తీసుకొచ్చారు. దీనికి కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ కు ముక్కుసూటిగా పని చేస్తారు అనే పేరు ఉంది. పైగా ఆయన గతంలో తెలంగాణలో అనేక ప్రాంతాలలో పోలీసు ఉన్నతాధికారిగా పని చేశారు. అనేక కీలకమైన కేసులను సాల్వ్ చేశారు. భూ అక్రమలకు పాల్పడే వ్యక్తుల గుండెల్లో నిద్రపోయారు. అంతటి కేసీఆర్ కూడా వరంగల్ లాంటి నగరానికి కమిషనర్ పోలీస్ గా రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక హైడ్రాకు కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు. అనేక చెరువులను రక్షించారు. కుంటలను బాగు చేశారు. నాలాలను పరిరక్షించారు. ఒక ముక్కలో చెప్పాలంటే విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుడుతున్నారు. కోర్టుల ద్వారా కొంతమంది వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. రంగనాథ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి బలమైన సపోర్టు లభిస్తుంది. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు సవాల్ చేస్తూ మళ్ళీ ప్రభుత్వం హైకోర్టులో వేరే బెంచ్ ను ఆశ్రయించడంతో రంగనాథ్ మీద వచ్చిన వ్యతిరేకత ఒక్కసారిగా పత్తా లేకుండా పోయింది.రంగనాథ్ గురించి ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఒకటి చర్చకు దారి తీస్తోంది. హైదరాబాద్ నగరంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి




రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమయంలో కూటమిలో ఉన్న నాయకులు మొత్తం హాజరు కావడం విశేషం. ఎంపీలు సానా సతీష్.. లక్ష్మణ్.. ఇంకా మున్నూరు కాపు సామాజిక వర్గంలో కీరకమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వంటి వారి హాజరయ్యారు. దానికి రంగనాథ కూడా హాజరయ్యారు. వాస్తవానికి కుల సంఘాల సమావేశాలకు.. ఇతర భేటీలకు రంగనాథ్ హాజరవుతూనే ఉంటారు. ఈ విషయంలో ఆయన మీద విమర్శలు ఉన్నప్పటికీ పట్టించుకోరు. అయితే కూటమిలో ఉన్న ఎంపీలు. ఇతర నాయకులు హాజరైన నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో రంగనాథ్ ఎంపీగా పోటీ చేస్తారని తెలుస్తోంది.ఏపీలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఆయన బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పోలీసు అధికారులు రాజకీయ నాయకులుగా మారిన ఉదాహ రణలు అనేక ఉన్నాయి. దీనికి రంగనాథ్ మినహాయింపు కాదు. పైగా రంగనాథ్ కు కూడా పొలిటికల్ లక్ష్యాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రకారం చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి లో ఉన్న ఏదో ఒక పార్టీ నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉంది. గతంలో ఆయన పవన్ కళ్యాణ్ ను కలిశారు. చిరంజీవి కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడ్డారు. ఈ నేపథ్యంలో జనసేనలో చేరి.. ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి తెలుస్తోంది. అయితే ఇది ప్రచారమేనా.. ఊహగానామా అనేది త్వరలోనే తేలనుంది.

## సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం

-మొదటిపేజీ తరువాయి

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా మూసీ, ఈసీ నదుల సంగమ స్థలమైన గాంధీ సరోవరం వరకు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నదీతీర అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీ వ్యవస్థను ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని పూర్తిస్థాయి నెట్ జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కూడా వారితో సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

హైదరాబాద్ నగరాన్ని కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్?రెడ్డి సింగపూర్ ప్రతినిధులతో వివరించారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటి, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యాసంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి అంగీకరించాయని వారికి తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సేవలు అందించడం, పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రి కోరగా సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో రాబోయే డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిష్టాత్మక తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు సింగపూర్ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృత్యువాత

సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. పటాన్‌చెరు ఠాణా పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గ్రామంలోని గణేశ్ విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడి మృతి చెందారు. చెరువులోంచి ఆరుగురు విద్యార్థులను స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కాగా మృతులను శిరీష ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించినట్లుగా సమాచారం.

మృతులు : నరసింహ రాజు, బీటెక్ సుమంత్ రెడ్డి, డిప్లొమా ఉదయ్ కిరణ్, డిప్లొమాతేజ, డిప్లొమా గణేశ్ సిద్దార్థ్, పదో తరగతి

**ఘటనపై గవర్నర్, సీఎం దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందిన ఘటనపై రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గణేశ్ నిమజ్జనాల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని గవర్నర్? సూచించారు. మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేసింది.

**ఈ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది**

నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృతిచెందిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి పొన్నం తెలియజేశారు. నిమజ్జనాల ప్రాంతాల్లో అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

## భూభారతి కాదు.. భూహారితి

-మొదటిపేజీ తరువాయి

రాస్తానన్నారు. భూభారతిలో 9, 200 మంది భూములు మరొకరికి మారాయని ఆరోపించారు హరీష్, భూభారతి స్కామ్ మీద సిట్టింగ్ జడ్జితో విచారణ ఎందుకు జరిపించరు? అని ప్రశ్నించిన హరీష్,, భూభారతి కాదు.. భూహారితి అంటూ ఎద్దేవా చేశారు.

## 22న ఏపీ ఎన్నికలకు నోటిఫికేషన్

**హైదరాబాద్ :** ఏపీలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత ప్రక్రియ స్పీడందుకుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి, ప్రచురణ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 22న ప్రకటించాలని నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఈ లిస్ట్‌ను రూపొందించాలని సూచించారు. మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి చేయనున్నారు. దీంతో అక్కడ సెప్టెంబర్ 3 నాటికే ఓటర్ల లిస్ట్ ప్రచురణ పూర్తి చేయనున్నారు. రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తైన 58 చోట్ల సెప్టెంబరు 3నే ఓటర్ల జాబితాలను ప్రకటించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి చేయనున్నారు. దీంతో ఆయా చోట్ల ఓటర్ల లిస్టుల ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ సెప్టెంబరు 13న ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎస్ఈసీ.. సెప్టెంబరు 22న ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల లిస్టుల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ రెడీ అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమం అవ్వనుంది. కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ స్పీడందుకోవడంతో ఇప్పటికే రాజకీయ పార్టీల్లో ఆసక్తి నెలకొంది. పురపాలక ఎన్నికలకు అవసరమైన పాలనా, ఎన్నికలపర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసేందుకు ఎస్ఈసీ చర్యలు ప్రారంభించింది. ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలపై ఎన్నికల సంఘం దృష్టి సారించనుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాల్లో ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించి తాజా నోటిఫికేషన్ల జారీతో పురపాలక ఎన్నికల ప్రక్రియకు ముందడుగు పడింది. ఈ నెల 22న వార్డుల వారీగా లిస్టులు ప్రచురించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి.

## 22ఏపై డైరక్ట్ ఫైట్..

**హైదరాబాద్ :** శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ.. శాసనసభను మాత్రం పొడిగించి, రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ అంశంపై స్వల్పకాలిక చర్చను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడం వెనుక కాంగ్రెస్ పక్కా రాజకీయ, వ్యూహాత్మక లెక్కలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. సాధారణంగా ఒక సెషన్ ముగింపు దశకు చేరినప్పుడు ఉభయ సభలూ ఒకేసారి నిరవధికంగా వాయిదా పడటం ఆనవాయితీ. కానీ, అసెంబ్లీని ప్రత్యేకంగా కొనసాగించడం ద్వారా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ వివాదాలు, ధరణి చుట్టూ గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన చీకటి ఒప్పందాలను అసెంబ్లీ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయించేందుకు ఒక భారీ రాజకీయ వేదికను సిద్ధం చేసుకుందని భావిస్తున్నారు.ఈ చర్చ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు విధాలుగా కలిసివచ్చే అస్త్రం. మొదటిది.. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు సస్పెన్షన్‌కు గురికావడంతో, సభలో ప్రభుత్వ దూకుడును అడ్డుకునే లేదా ప్రతిపక్ష వాణిని బలంగా వినిపించే ప్రధాన ప్రతిపక్ష గొంతు లేకుండా పోయింది. స్పీకర్ వివాదం, అరెస్టులతో వచ్చిన రాజకీయ రగడను పక్కకునెట్టి.. ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న భూ సమస్యల వైపు ప్రజా దృష్టిని మళ్లించేందుకు ఇది అద్భుతమైన అవకాశం.

# బిజినెస్

## అడిడాస్ ఇండియాలో లేఆఫ్‌లు.. సగం మందిపై ప్రభావం





ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ అడిడాస్ (Adidas) కూడా భారత్‌లో లేఆఫ్‌లు ప్రకటించింది. గురుగ్రామ్‌లోని టెక్ హబ్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులతోపాటు పలు విభాగాల ఇంజినీర్లను తొలగించేందుకు సిద్ధమైంది. లేఆఫ్ విషయాన్ని అడిడాస్ ధ్రువీకరించినప్పటికీ.. ఎంత మందిని తొలగిస్తోందనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. అయితే, దిల్లీ కార్యాలయంలో దాదాపు సగం మంది ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. వ్యాపార అవసరాలకు అనుగుణంగా నిర్వహణ పద్ధతులను మార్చే ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నట్లు అడిడాస్ పేర్కొంది. ఈ మార్పుల వేళ ప్రభావిత మయ్యే ఉద్యోగులకు తగిన చేయూత అందిస్తామని ఓ ప్రకటనలో వెల్లడించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కొందరిని తక్షణమే తొలగించగా.. మరికొందరు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతారని చెప్పినట్లు సమాచారం. గురుగ్రామ్‌లోని అడిడాస్ టెక్ హబ్‌లో దాదాపు 700 మంది పనిచేస్తున్నట్లు అంచనా.

## రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కోలుకున్నాయి. వరుసగా రెండు రోజుల నష్టాల తర్వాత సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్‌ఎంసీజీ రియల్టీ ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు చమురు ధరలు తగ్గడం కూడా మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ 332.63 పాయింట్లు లాభపడి 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. అయితే మార్కెట్‌లో మొత్తం కొనుగోళ్ల జోరు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం స్వల్పంగా తగ్గింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం నష్టపోయింది. రంగాల వారీగా ఎఫ్‌ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ సూచీలు లాభాల్లో ముందున్నాయి. ఐటీ, ఫార్మా సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీకి 23,300–23,400 స్థాయిలో నిరోధం ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 23,500 పైన నిలకడగా ఉంటే సూచీ పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దిగువన 23,100–23,070 స్థాయిని కీలక మద్దతుగా చూస్తున్నారు. 23,070 కిందకు పడితే అమ్మకాల ఒత్తిడి పెరిగి 23,000–22,800 స్థాయిలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయంపైనే మదుపర్ల దృష్టి ఉంది. వడ్డీ రేట్లపై ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో నగదు లభ్యత, పెట్టుబడుల ప్రవాహం, సమీపకాల మార్కెట్ దిశను ప్రభావితం చేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు.

## సంపదలో అదానీని దాటేసిన
# టిక్‌టాక్ వ్యవస్థాపకుడు

ఆసియా కుబేరుల జాబితాలో పెద్ద మార్పు నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్ 'టిక్‌టాక్' మాతృ సంస్థ బైట్‌డాన్స్ వ్యవస్థాపకుడు ఝాంగ్ యిమింగ్ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా కొత్త రికార్డు సృష్టించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా వెలువరించిన నివేదిక ప్రకారం, భారత పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీని అధిగమించి యిమింగ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నారు.



**105 బిలియన్ డాలర్ల మైలురాయి**

43 ఏళ్ల ఝాంగ్ యిమింగ్ నికర సంపద ఒక్కసారిగా 105 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.7 లక్షల కోట్లు) మార్కును దాటింది. ఇటీవల బ్లాక్‌రాక్, ఫిడెలిటీ ఇన్‌వెస్ట్‌మెంట్స్ వంటి అంతర్జాతీయ ప్రాజెక్ట్ వ్యాల్యుయేషన్ సంస్థలు బైట్‌డాన్స్ షేర్ల విలువను గణనీయంగా పెంచడంతో యిమింగ్ సంపద కేవలం ఒక్క నెలలోనే 12 బిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. 2019 మార్చిలో యిమింగ్ సంపద కేవలం 13 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఇప్పుడు అది ఎనిమిది రెట్లకు పైగా పెరగడం గమనార్హం.

**ఏఐ సాంకేతికతతో వృద్ధి**

కేవలం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతోనే కాకుండా బైట్‌డాన్స్ సంస్థ ఏఐ విభాగంలోకి అడుగుపెట్టడం యిమింగ్ సంపద పెంపునకు ప్రధాన చోదక శక్తిగా మారింది. బైట్‌డాన్స్ అభివృద్ధి చేసిన 'దౌబావో' ఏఐ చాట్‌బాట్, సీడాన్స్ వంటి ఏఐ వీడియో జనరేషన్ టూల్స్ మార్కెట్లో ఊహించని రీతిలో విజయం సాధించాయి.

**భారత బిలియనీర్లు**

మరోవైపు, భారత పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ సంపద మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ఇటీవలి కాలంలో కాస్త క్షీణించి రెండో స్థానానికి చేరారు. ముకేశ్ అంబానీ కూడా తదుపరి స్థానాల్లోనే ఉన్నారు. ఆసియాలో ఇప్పటివరకు ఇంధనం, మౌలిక సదుపాయాలు, ఓడరేవులు వంటి సాంప్రదాయ రంగాల నుంచి బిలియనీర్లు అగ్రస్థానంలో నిలవగా ఇప్పుడు సాంకేతికత, ఏఐ–ఆధారిత రంగాలకు చెందిన టెక్ యజమానులు సంపన్నులుగా ఎదగడం గమనార్హం.

# యూపీఐ ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ

దిల్లీ: యూపీఐ లావాదేవీలకు సంబంధించి పెద్ద వ్యాపారులకు ఎండీఆర్‌తో పాటు మరో భారం కూడా పడనుంది. రూ.2,000కు మించి జరిపే యూపీఐ చెల్లింపులపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేటుపై వ్యాపారులు 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే వారు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను పొందడం ద్వారా మొత్తం పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చని పన్ను నిపుణులు చెబుతున్నారు. వ్యక్తులు రూ.2వేలు పైబడి వ్యాపారులకు చేసే యూపీఐ చెల్లింపులపై అక్టోబర్ 15 నుంచి 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుంది. గరిష్ఠ పరిమితిని రూ.300గా కేంద్రం నిర్ణయించింది. రైల్వే, టెలికాం, బీమా, పెట్రోల్ బంకుల్లో ఫ్లాట్ రేటు రూ.5గా నిర్ణయించారు. ప్రతిపాదిత విధానం ప్రకారం చెల్లింపు సేవలు వినియోగించుకున్నందుకు గానూ ఎండీఆర్ భారాన్ని వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. దీనికి 18 శాతం జీఎస్టీ కూడా వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల ఏటా రూ.3,500 నుంచి రూ.4వేల కోట్ల ఆదాయం సమకూరనుందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ వెల్లడించారు. అయితే, ఈ రుసుములను భరించే నమోదిత వ్యాపారులు చెల్లించిన జీఎస్టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవడం ద్వారా పన్ను భారం తగ్గించుకోవచ్చని చెప్పారు. లావాదేవీ విలువతో సంబంధం లేకుండా 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటుపై మాత్రమే 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని మరో పన్ను నిపుణుడు శివకుమార్ రమ్జీ తెలిపారు. జీఎస్టీ పరిధిలో ఉన్న వారు ఐటీసీ ద్వారా మినహాయింపు ఈ భారం తగ్గించుకోవచ్చని, జీఎస్టీ వెలుపల ఉన్న వ్యాపారులు మాత్రం ఎండీఆర్ ఛార్జీలతో పాటు దానిపై జీఎస్టీ భారమూ భరించాల్సి ఉంటుందని తెలిపారు.



**వెనక్కి వెళ్లే ఉద్దేశమే లేదు**

యూపీఐపై ఛార్జీల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గే ఉద్దేశమేదీ లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక పునరాలోచన చేసే అవకాశమే లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు. యూపీఐని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఎండీఆర్ ఛార్జీల విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఎండీఆర్ ఛార్జీలపై విపక్ష పార్టీలు, ట్రేడర్ల నుంచి వ్యతిరేకత వస్తున్న వేళ ప్రభుత్వం నుంచి ఈ స్పందన వెలువడింది.

## విండీస్ సిరీస్‌కు భారత జట్ల ప్రకటన..
# రోహిత్, కోహ్లి కొనసాగింపు

ఈ నెలాఖరులో వెస్టిండీస్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత జట్లను ఇవాళ ప్రకటించారు. వన్డే జట్టుకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, టీ20 జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగారు. కేఎల్ రాహుల్, తిలక్ వర్మ వన్డే, టీ20 జట్లకు ఉప నాయకులుగా వ్యవహరించనున్నారు. స్టార్ ద్వయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే జట్టులో కొనసాగగా.. రిషబ్ పంత్‌కు అవకాశం దక్కలేదు. ఆకిబ్ నబీ, నమన్ ధిర్‌కు తొలిసారి వన్డే జట్టులో అవకాశం దక్కింది. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. రెండు జట్లలో అతడికి చోటు దక్కలేదు.




**వన్డే సిరీస్‌కు భారత జట్టు**

శుభ్‌మన్ గిల్ (సి), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధిర్

**టీ20 సిరీస్‌కు భారత జట్టు**

శ్రేయస్ అయ్యర్ (సి), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), సంజు శాంసన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

**వన్డే సిరీస్ షెడ్యూల్**

తొలి వన్డే: ఆదివారం, సెప్టెంబర్ 27 – మధ్యాహ్నం 2:00 గంటలకు – గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం

రెండో వన్డే: బుధవారం, సెప్టెంబర్ 30 – మధ్యాహ్నం 2:00 గంటలకు – బర్సపారా క్రికెట్ స్టేడియం, గౌహతి

మూడో వన్డే: శనివారం, అక్టోబర్ 3 – మధ్యాహ్నం 2:00 గంటలకు – మహారాజా యాదవేంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, ముల్లన్‌పూర్, న్యూ చండీగఢ్

**టీ20 సిరీస్ షెడ్యూల్**

తొలిటీ20: మంగళవారం, అక్టోబర్ 6 – సాయంత్రం 7:00 గంటలకు – భారత్ రత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం, లక్నో

రెండో టీ20: శుక్రవారం, అక్టోబర్ 9 – సాయంత్రం 7:00 గంటలకు – జేఎస్‌సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్, రాంచీ

మూడో టీ20: ఆదివారం, అక్టోబర్ 11 – సాయంత్రం 7:00 గంటలకు – హోల్కర్ స్టేడియం, ఇండోర్

నాలుగో టీ20: బుధవారం, అక్టోబర్ 14 – సాయంత్రం 7:00 గంటలకు – రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం, హైదరాబాద్

ఐదో టీ20: శనివారం, అక్టోబర్ 17 – సాయంత్రం 7:00 గంటలకు – ఎం. చిన్నస్వామి స్టేడియం, బెంగళూరు

# కీలక టోర్నీ నుంచి సీఎస్‌కే స్టార్ ఔట్..!

చెన్నై సూపర్ కింగ్స్ యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే మరో కీలక దేశవాళీ టోర్నీకి దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో వచ్చే నెలలో జరిగే ఇరానీ కప్‌కు అతడు అందుబాటులో ఉండడని సమాచారం. నివేదికల ప్రకారం.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఆయుష్‌కు ఇంకా ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు.

**అక్టోబర్ 1 నుంచి ఇరానీ కప్**

రంజీ ట్రోఫీ 2025–26 విజేత జమ్మూ కశ్మీర్‌తో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఇరానీ కప్‌లో తలపడనుంది. ఈ వన్–ఆఫ్ మ్యాచ్ అక్టోబర్ 1 నుంచి 5 వరకు శ్రీనగర్‌లోని షేర్–ఎ–కశ్మీర్ స్టేడియంలో జరగనుంది. బీసీసీఐ త్వరలో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఫిట్‌నెస్ క్లియరెన్స్ లేకపోవడంతో ఆయుష్ మాత్రే పేరును పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది.

**ఐపీఎల్ 2026లో ఆరు మ్యాచ్‌లే..!**

ఆయుష్ మాత్రేకు గాయం సమస్యలు ఐపీఎల్ 2026లోనే మొదలయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన అతడు టోర్నీ మధ్యలో హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. దీంతో ఐపీఎల్ సీజన్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026లో ఆయుష్ ఆరు మ్యాచ్‌ల్లో 201 పరుగులు చేశాడు. అతడి బ్యాటింగ్ సగటు 33.50 కాగా, స్ట్రైక్‌రేట్ 177.87గా ఉంది.

**ముంబై టీ20 లీగ్‌కు కూడా దూరం**

ఐపీఎల్ గాయం నుంచి కోలుకుంటున్న సమయంలోనే ఆయుష్‌కు మరో గాయమైంది. ముంబై టీ20 లీగ్ 2026కు



ముందు అతడికి మణికట్టు గాయం కావడంతో ఆ టోర్నీకి కూడా దూరమయ్యాడు. ప్రస్తుతం ఆయుష్ ఇండోర్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, పోటీ క్రికెట్‌లోకి తిరిగి రావాలంటే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాల్సి ఉంది.

# స్పోర్ట్స్


## కెప్టెన్‌గా రిషబ్ పంత్ ఎంపిక?




బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఇవాళ వెస్టిండీస్ సిరీస్‌కు భారత జట్ల ప్రకటనతో పాటు ఇరానీ కప్ 2026 కోసం రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును కూడా ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా రిషబ్ పంత్‌ను ఎంపిక చేసింది. పంత్‌కు విండీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు ఎంపిక? చేసిన జట్లలో చోటు దక్కలేదు. రంజీ ట్రోఫీ 2025–26 విజేత జమ్మూ కశ్మీర్‌తో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఇరానీ కప్‌లో తలపడనుంది. ఈ వన్–ఆఫ్ మ్యాచ్ అక్టోబర్ 1 నుంచి 5 వరకు శ్రీనగర్‌లోని షేర్–ఎ–కశ్మీర్ స్టేడియంలో జరగనుంది.

**ఇరానీ కప్ కోసం రెస్ట్ ఆఫ్ ఇండియ జట్టు**

రిషబ్ పంత్ (కెప్టెన్ మరియు వికెట్ కీపర్), సనత్ సాంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్, ఆకాశ్ దీప్ (ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి), ముఖేష్ కుమార్, ముకేష్ చౌదరి, ఆర్యన్ జుయల్ (వికెట్‌కీపర్), ఆర్యన్ పాండే, అనుకూల్ రాయ్, ఆయుష్ దోసెజా




## శ్రీహరి కొడుకు మేఘాంశ్ 'ఆస్మాన్' టీజర్ వచ్చేసింది.!

టాలీవుడ్ దివంగత నటుడు శ్రీహరి తనయుడిగా సినీరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి శ్రమిస్తున్న యువ నటుడు మేఘాంశ్ శ్రీహరి తాజాగా మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన 'ఆస్మాన్' సినిమా టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ పతాకంపై శ్రీమతి కొండారు శ్రీనివాసరావు సమర్పణలో కొండారు వెంకటేష్, శ్రీకాంత్ మన్నెం సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రామ్ నందన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు మోషన్ పోస్టర్లు ఇప్పటికే మంచి బజ్ సృష్టించగా, తాజాగా హీరో మేఘాంశ్ శ్రీహరి జన్మదినం సందర్భంగా విడుదలైన టీజర్ సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా, ఒక మిస్టరీ థ్రిల్లర్‌లా సాగింది. ముఖ్యంగా టీజర్‌లో వినిపించిన డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. "మీరు ఇప్పుడు గొంగలి పురుగు దశలో ఉన్నారు.. అది దాటి సీతాకోక చిలుక దశలోకి మారాలి.. దానికి మార్గం నేనే.. మీరందరూ కూడా కనిపించే చీకట్లో ఉన్నారు.. అదే నిజం" అంటూ హీరో చెప్పిన వాయిస్ ఓవర్ మరియు డైలాగ్స్ సినిమాలోని డెప్త్‌ను తెలియజేస్తున్నాయి. కేవలం డైలాగ్స్ మాత్రమే కాకుండా, టీజర్‌లోని విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్, అలాగే ఎమోషనల్ లేయర్స్ ప్రేక్షకులను కట్టిపడేసేలా డిజైన్ చేశారు. అన్ని వర్గాల ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉన్న ఈ గ్లింప్స్‌లో మేఘాంశ్ శ్రీహరి సరికొత్త మేకోవర్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సాంకేతిక నిపుణుల పనితీరు కూడా ఈ సినిమాకు ప్రధాన బలంగా మారనుంది. ప్రశాంత్ ఆర్ విహారి అందిస్తున్న నేపథ్య సంగీతం, షోయబ్ సినిమాటోగ్రఫీ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. పూర్తి స్థాయి యాక్షన్ మరియు ఎమోషనల్ హంగులతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ మరియు అరబిక్ భాషల్లోనూ పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో మేఘాంశ్ శ్రీహరి సరసన రాయంచ నటిస్తుండగా.. రవివర్మ, కమల్, కేశవ్ దీపక్, నిఖిల్, రాజశేఖర్, పద్మిని, ప్రేరణ గ్యాంగ్, సంతోష్, రమణ, కుమార్, మరియు ప్రముఖ నటుడు సత్యరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ వ్యవహరిస్తుండగా, శ్రీమతి కొండారు శ్రీనివాసరావు సమర్పిస్తున్నారు. కొండారు వెంకటేష్, మన్నెం శ్రీకాంత్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, రామ్‌నందన్ దర్శకత్వం వహిస్తున్నారు. షోయబ్ కెమెరా బాధ్యతలు నిర్వర్తించగా, మణికంఠ ఆర్ట్ డైరెక్టర్‌గా, స్వప్న కొండారు సీఈవోగా సేవలందిస్తున్నారు. నరేష్ ఎడిటర్‌గా, ప్రశాంత్ ఆర్ విహారి సంగీత దర్శకుడిగా పనిచేస్తుండగా, ధని ఏలె పోస్టర్ డిజైనర్‌గా వ్యవహరించారు. పీఆర్వో బాధ్యతలను నాయుడు -- ఫణి చూసుకుంటున్నారు.

## 'ఎల్లమ్మ' సినిమాలో హీరోయిన్‌గా 'రోమాంచకం' బ్యూటీ?



టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌లలో ఒకటైన 'ఎల్లమ్మ' సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ వేణు ఎల్దండి దర్శకత్వంలో, రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రంలో హీరోయిన్‌గా యువ నటి అనంతిక సనిల్‌కుమార్ నటించబోతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. 'బలగం' వంటి ఎమోషనల్ అండ్ సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత వేణు ఎల్దండి తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో నాయిక పాత్రకు తగినట్టుగా అనంతిక సనిల్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. నటనకు ఆస్కారం ఉన్న ఈ పాత్రలో ఆమె తన పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను మెప్పించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

## వరుస విజయాలతో బాక్సాఫీస్ క్వీన్‌గా మమిత బైజు.. ఏడాదిలోపే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం!



మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా అంతటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో మమిత బైజు ఒకరు. గడిచిన ఏడాది కాలంలో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఏకంగా రూ. 1000 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను దాటడం విశేషం. కేవలం సహజమైన నటనతోనే కాకుండా తనదైన ప్రత్యేక శైలితో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ యంగ్ హీరోయిన్, ప్రస్తుతం సౌత్ సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ నటిగా దూసుకుపోతున్నారు.కొత్త సినిమాలు చూడండి కేరళలోని కొట్టాయంకు చెందిన మమిత బైజు 2016లో విడుదలైన 'పావడ' చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించినప్పటికీ, 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ చిత్రంలోని 'రీను' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో కూడా ఆమె బలమైన స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. ఇక గత ఏడాది కాలంలో మమిత బైజు నటించిన సినిమాల బాక్సాఫీస్ సునామీ చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విజయ్ సరసన నటించిన సినిమా ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, ప్రదీప్ రంగనాథన్‌తో చేసిన చిత్రం రూ. 100 కోట్లు రాబట్టింది. అలాగే సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం రూ. 260 కోట్లు, ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా రూ. 55 కోట్లు సాధించాయి. మరోవైపు థియేటర్లలో దూసుకుపోతున్న 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' ఇప్పటికే రూ. 310 కోట్లకు పైగా వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఇలా కేవలం 12 నెలల వ్యవధిలోనే ఆమె నటించిన చిత్రాలు సుమారు రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి, ఎంతో ఆత్మవిశ్వాసంతో నటించడంలో మమిత బైజు దిట్ట. ఏ పాత్రను ఎంచుకున్నా దానికి పూర్తి న్యాయం చేయడం ఆమె ప్రత్యేకత. అందుకే రోజురోజుకూ ఆమెకు ఫ్యాన్ ఫాలోవర్స్ భారీగా పెరిగిపోతున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న మమిత బైజు రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.


## విజయ్ సేతుపతి 'బత్తా' టీజర్ విడుదల.. వింటేజ్ లుక్‌లో అదరగొట్టిన మక్కల్

కోలీవుడ్ స్టార్ హీరో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తాజా చిత్రం 'బత్తా' తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నడువుల కొంచెం పక్కతా కానుమ్న?', 'సీతకాతి' వంటి విభిన్న చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు బాలాజీ తరుణీధరన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.వీశీజఅవం పూర్తిగా 1960ల నాటి వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ మరియు ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' ఫేమ్ లిజో మోల్ జోస్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల విడుదలైన 'మగలే' అనే తండ్రీకూతుళ్ల భావోద్వేగ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తుండటం విశేషం. విజయ్ సేతుపతి వింటేజ్ లుక్‌లో బీడీ కాలుస్తూ చాలా డిఫరెంట్ స్టైల్‌లో కనిపిస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.




## హనుమాన్ అంశ్ తెలుగు వర్షన్ వాయిదా.. అసలు కారణమిదే

బాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలిచిన మూవీ హనుమాన్ అంశ్. ఈ మూవీ అక్కడ హిట్ కావడంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా విడుదల హక్కులను డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ తీసుకున్నారు. అంతేకాకుండా ఈనెల 15న తెలుగు టీజర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ అలాంటిదేం జరగలేదు. దీంతో సినీ ప్రియుల్లో ఈ మూవీ రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. తెలుగు రిలీజ్ ఈ నెల 18న కావడం లేదని ప్రముఖ ఓవర్‌సీస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్ ప్రకటించింది. అందుకు గల కారణాన్ని సైతం వెల్లడించింది. తెలుగు వర్షన్ డబ్బింగ్ పనులు పూర్తి కాలేదని తెలిపింది. అందువల్లే హనుమాన్ అంశ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త రిలీజ్ తేదీని ప్రకటిస్తామని పేర్కొంది. కాగా.. త్రివిక్రమ్ తెలుగులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ?అయితే ఆయన ఈ డీల్ నుంచి తప్పుకోవడం వల్లే విడుదల ఆగిపోయిందని వార్తలొచ్చాయి. కానీ తాజాగా డబ్బింగ్ పనుల వల్లే రిలీజ్ కావడం లేదని ప్రకటించారు. దీంతో తెలుగు రిలీజ్‌పై ఉన్న సస్పెన్స్‌కు తెరపడింది. ఈ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు. ఈ మూవీ బాలీవుడ్‌లో రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.




printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512